POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
సెప్టెంబరు 2023
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 41 సంచిక: 05



## ఈ నెల పండుగలు

**సెప్టెంబరు *03* - శ్రీ చీరాల స్వామి ఆరాధన**
**సెప్టెంబరు *03* - శ్రీ గురుచరిత్ర గ్రంథ కృతజ్ఞతార్చన**
**సెప్టెంబరు *06/07** - శ్రీకృష్ణ జన్మాష్టమి**
**సెప్టెంబరు *18* - వినాయక చవితి**
**సెప్టెంబరు *18* - శ్రీ శ్రీపాద వల్లభ జయంతి (భాద్రపద శుద్ధ చవితి)**
**సెప్టెంబరు *20* - శ్రీ గజానన్ మహారాజ్ ఆరాధన (భాద్రపద శుద్ధ పంచమి)**

*శ్రీకృష్ణ జన్మాష్టమి తేదీలు స్మార్త, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ప్రకారము మార్పులు కలవు.
భక్తులు గమనించగలరు.

"పారాయణంటే భగవంతుని లీలలు, అవతార విశేషాలు చదువుకుంటూ, వింటూ – అందులో పరాయణత చెందడమే. క్రమంగా మన తలంపులు, ఆచరణ, ఆశయాలు అన్నీ ఆయన పరంగా మారడమే – సంసారుల జీవితాలు తమ కుటుంబ శ్రేయస్సే లక్ష్యంగా కల్గినట్లు; ఏమి చేస్తున్నా, ఎక్కడున్నా మరపురానట్లు; మానవులందరు తాము తమ శరీరాలు, పేర్లు అన్న భావంతో తాదాత్మ్యం చెందినట్లు – భగవంతుని ప్రీతిని, స్మరణనూ పెంచేవిగా మారేలాగున చదవడము, మననం చేయడము – యివే పారాయణ! ప్రేయసికి ప్రియమైనవన్నీ ప్రియునికి ప్రీతికరములై, మిగిలినవన్నీ అయిష్టమైనట్లు క్రమంగా మన సద్గురువుకు ప్రీతికరమైన మాటలు, పనులు, నడవడులే మనకు ప్రీతికరములవడం పరాయణత. అది కల్గేలా సద్గ్రంథాలను చదవడం పారాయణ."

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# మనకు నిజంగా ఆధ్యాత్మికత కావాలా?

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

మతాచారాలన్నింటిలోనూ దాగియున్నది మనకు భగవంతుడిచ్చిన, చేసినదానికంతటికీ నిరంతరమైన కృతజ్ఞతా భావం. అది సంవత్సరం పొడుగునా పండుగల రూపంలోనేగాక నిత్యకృత్యంలో పంచ యజ్ఞాల ద్వారా గూడా భగవంతునికి నివేదించుకోవాలని ఋషులు, ప్రవక్తలు చెప్పారు. కాని మనం కృతజ్ఞత తెల్పుకోవలసిన భగవంతుడెక్కడున్నాడు? ఆయననెలా భావన చేయాలి?

పరమాత్మ విశ్వమంతా వ్యాపించి దానికతీతంగా గూడ వున్నాడు. నిత్యమూ ఆయననలాగే స్మరించాలని వేదాలు తెల్పుతున్నాయి. ఈ భావం కల్గడానికి, నిలవడానికీ "భగవంతుడు అంతటా వున్నాడు" అన్న వాక్యం స్మరిస్తే చాలదు. మనలోని తమోగుణం వలన ఆ వాక్యమనుకోగానే మనసు విశ్వమంతటినీ దైవంగా భావించదు. ఆ నిజాన్ని స్పష్టంగా, వివరంగా గుర్తించి పులకించి, ప్రకృతి మరియు విశ్వాల గురించి నిత్యమూ క్రొత్తగా ఆశ్చర్యం పొందగల్గడము, ఆయన మహిమను గుర్తించి పులకించగల్గడము - ఇదే నిజమైన స్తుతియొక్క లక్షణం.

ఇలా గుర్తించకుండా భగవంతుని స్తుతించడమంటే కేవలం పొగడడం మాత్రమే కాబోలనుకోవడం ఆయనను కించపరచడమే అవుతుంది. ఒక మహాకవి వ్రాసిన మహాకావ్యం జాగ్రత్తగా చదవకుండానే బాగుందనడం దానిని, ఆ కవినీ గూడ తృణీకరించడమే అవుతుంది. అంతే గాదు భగవంతుడు తనను అలా గుడ్డిగా స్తుతించిన వారిని అనుగ్రహిస్తాడనుకొంటే ఆయన కేవలం ముఖస్తుతికి లోబడే తెలివి తక్కువవాడని, అంతటి అర్హతలేని వాడనీ మనం తలచినట్లే అవుతుంది. మనము భగవంతుని మహిమ (విభూతి)ను సృష్టియంతటా మరింత వివరంగా గుర్తించి పులకించగలగాలని ఋషుల భావం.

మొదట "పాదోఽస్య విశ్వాభూతాని" - "ఈ విశ్వము మరియు భూతములన్నీ కలసి ఆయనలోని ఒక్క అంశము మాత్రమే" అని గుర్తించమని వేదం చెబుతున్నది. అందుచే సాయి "నీవు చూచేదంతా కలసి నా రూపం" అన్నారు. "నేనీ విశ్వమంతటా, అతీతంగానూ గూడ వున్నాను" అన్నారు. అటు తర్వాత "నక్షత్రాణి రూపం" - "నక్షత్రాలన్నీ కలసి ఆయన రూపమే"; "భూః పాదౌ", "భూమియే ఆయన పాదములు" - ఇలా నక్షత్రాలన్నింటినీ తన గర్భంలో ధరించిన అనంతమైన ఆకాశం నుండి నక్షత్రమండలం వరకూ ఆయనే యని స్మరించాక, ముల్లోకాలు మరియు సూర్యుడు గూడ ఆయన రూపమేనని సంధ్యావందనంలో స్మరిస్తాము. మన హృదయంలో శుద్ధచైతన్యంగా దాగియుండి మన భావాలను గూడ ఆయనయే ప్రబోధిస్తున్నాడని గాయత్రీ మంత్రం చెబుతుంది. ఇది గూడ చాలదు. అందుకే అన్ని జీవుల రూపాలలోనూ ఆయనయే వున్నాడని, జీవముగూడ ఆయనయేనని తెల్పడానికి భగవంతుడు వేలాది తలలు, కళ్ళు, పాదాలు కలిగి వున్నాడని వేదం చెబుతుంది. అంటే అటు అపారమైన విశ్వం నుండి సాటి జీవులవరకూ అన్నీ ఆయన రూపాలేనని సాధ్యమైనంత వివరంగా మన హృదయం గుర్తించి మళ్ళీ మళ్ళీ పులకిస్తుండాలని ఋషులు తెల్పారు. భగవద్గీతలోని విభూతియోగంలో గూడ శ్రీ కృష్ణుడలానే చెప్పాడు.

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:41 సెప్టెంబరు-2023 సంచిక:05

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | **మనకు నిజంగా ఆధ్యాత్మికత కావాలా?** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | **పరిప్రశ్న** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 07 |
| 03. | **గృహస్థాశ్రమము** | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 08 |
| 04. | **మాతృదేవి స్మృతులు** | సైదారెడ్డి దంపతులు | 11 |
| 05. | **వార్తాలాపము** | శ్రీమతి అడిదం వేదవతి | 13 |
| 06. | **రేగేసాహెబ్** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 17 |
| 07. | **శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు** | శ్రీమతి శ్రీదేవి | 21 |
| 08. | **ధుని ప్రదాత** | డాక్టర్. నర్సింహం (కావలి) | 25 |
| 09. | **ద్వారకామాయి అనుభవమండపము** | శ్రీమతి అపర్ణ | 27 |
| 10. | **ఆచార్యుని అద్భుత లీలలు** | శ్రీ విజయ కుమార్ | 28 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

సృష్టిపట్ల, జీవులపట్ల మన భావము, అవగాహన, వైఖరి మారాలి. అలా స్తోత్రం ద్వారా సాధించుకొన్న ఆశ్చర్యమే స్తోత్రంలో ప్రకటమవ్వాలి. తర్వాత దానిని ఆచరణలోకి తెచ్చుకొనడమే ఆచారమంటే! అతిథి భగవత్స్వరూపమని గుర్తించి సేవించాలి; పళ్ళు తోముకొనే పుల్లలు, పూజకు తులసి, దర్భలు కోసుకునేప్పుడు ఆయా చెట్లను గూడా ఎలా స్తుతించి, ప్రార్థించి కృతజ్ఞతతో కోసుకోవాలో శ్లోకాలు, మంత్రాలు తెల్పుతున్నాయి. స్నానం చేసేప్పుడు ఆ నీరు భగవత్స్వరూపమని, అదే అన్ని పుణ్యనదుల రూపంలోనూ వున్నదనీ మనను బాహ్యాభ్యంతరాలలో పవిత్రం చేయడానికి భగవదనుగ్రహం ఆ రూపంగా వెలిసిందనీ గుర్తించి స్నానం చేయమని వేదమంత్రాలు చెబుతాయి. భోజనము, దాంపత్యమూ గూడ అట్టి భావనతోనే నిర్వహించాలని తెలిపే మంత్రాలు గూడ వున్నాయి.

ఏ మాత్రమాలోచించినా సృష్టిలో ప్రతి చిన్న అంశమూ అత్యద్భుతమైనదని నేటి విజ్ఞాన శాస్త్రాలన్నీ చెబుతున్నాయి. అవి చదివిన వాళ్ళముగూడ నిత్యజీవితంలో యాంత్రికంగా ప్రవర్తిస్తాము. సృష్టియందంతటా అనుక్షణమూ ప్రకటమౌతున్న దివ్య విభూతిని గుర్తించలేక పశుప్రాయంగా జీవిస్తాము. రాగద్వేషాలు, యిష్టాయిష్టాల వలయంలో తగుల్కొంటాము. ఇట్టి నిద్ర నుండి మేల్కొనే యత్నాలే మతాచారాలన్నీ! అట్టి మెలకువలో జీవించగల్గడమే ఆధ్యాత్మికత. ఎల్లెడలా ప్రకటమయ్యే భగవంతుని మహిమపట్ల ఆశ్చర్యచకితులమవడము, దానివలన మనకు అనుక్షణమూ జరిగే మేలుకు చాలినంతగా కృతజ్ఞులమై వుండడమే ఆధ్యాత్మికత. సృష్టిలో దేని నుండి, ఎవరి నుండి ఎటువంటి మేలు జరిగినా, ఏ మాత్రం జ్ఞానం కలిగినా అవన్నీ, లేక వారందరూ భగవంతుని అనుగ్రహ రూపాలేనని కృతజ్ఞతతో, భక్తితో జీవించలేని వారికి ఆధ్యాత్మికతే సాధ్యమవదు.

పళ్ళుతోముకునే పుల్ల, స్నానం చేసే నీరు, శరీరాన్ని పోషించే తిండి, జన్మనిచ్చిన తల్లిదండ్రులు, అనుక్షణమూ ప్రాణంపోసే వాయువు, శరీరాన్ని జీవింపచేసే అగ్ని – వీటిపట్ల గూడా కృతజ్ఞతతో, భక్తితో జీవించాలని వేదమంత్రాలు తెల్పుతున్నాయి. ఇటువంటి గుర్తింపు, కృతజ్ఞత లేకుండా జీవించడమే మోహమనే నిద్ర; ఒక విధమైన జీవన్మృతి. దాని నుండి మేల్కొలిపి యిట్టి అవగాహన మొదట మనకెవరి నుండి కల్గుతుందో, లేక దేని నుండి కల్గుతుందో అది (లేక, వారు) భగవదనుగ్రహం యొక్క ప్రత్యక్ష రూపాలు. అట్టి భక్తి, కృతజ్ఞత స్థిరంగా నిలుపుకోనిదే ఆత్మజ్ఞానం కల్గదు; సాధన సఫలమవదు. అంతకు మించిన కృతజ్ఞత లేదు. మన శరీరానికి జన్మనిచ్చి, తగిన వయస్సులో గురువు వద్దకు పంపి యిటువంటి జ్ఞానం కల్గేలా చేస్తారు గనుకనే తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు. అలా చేయని తల్లిదండ్రులు పితృఋణము, ఋషిఋణమూ తీర్చుకోని వారేనని, సరియైన తల్లిదండ్రులే గారనీ వేదాలు, పురాణాలు చెబుతున్నాయి.

భాగవతంలోని అవధూతకు పంచభూతాలు, వివిధ జీవులూ యిట్టి ప్రబోధం చేసారు గనుక స్థూలదృష్టికి అవెంత అల్పమైనవిగా కన్పించినా, ఆయన మాత్రం వాటిపట్ల కృతజ్ఞతతో గురుభావమే వహించడం గమనించాలి. ఆయన అవధూత అయిన తర్వాత గూడ వాటిపట్ల భక్తిశ్రద్ధలు, కృతజ్ఞత అలానే నిలవాలి. తమకు గల్గిన ఆత్మజ్ఞానానికి, ఆనందానికి, మృత్యురాహిత్యానికి అవే మూలకారణమని ఆయన నమ్రతతో చెప్పుకొన్నాడు. మహాత్ములందరిలోకీ కోహినూర్ వజ్రం వంటి వారనీ, సామ్రాట్టనీ చెప్పదగినంతటి స్థితి పొందాక గూడా సాయిబాబా అత్యంత వినమ్రత, భక్తిశ్రద్ధలతో, "ఇదంతా నా గురువుయొక్క అనుగ్రహమే!" అని చెప్పడంలో గల భావమిదే. శ్రీపాద శ్రీవల్లభులు తమ తల్లిదండ్రులనే గురువులుగా భావించారు. శ్రీ నృసింహ సరస్వతి స్వామి తమ గురు పరంపరలో కృతజ్ఞతతో శ్రీ కృష్ణసరస్వతి స్వామిని ప్రస్తావించకుంటే అది గురు చరిత్రలోకి ఎక్కేది కాదు – ఆయన కిట్టి జ్ఞానం సహజమైనప్పటికీ, కేవలం బాహ్యమూ, అనావశ్యకమూ అయిన సన్యాస దీక్ష మాత్రమే శ్రీ కృష్ణసరస్వతి స్వామి వద్ద ఆయన పొందినప్పటికీ ఆయనంత కృతజ్ఞతతో చెప్పుకొనడం మనకు సరియైన మార్గం తెల్పడానికే. శ్రీ మాణిక్య ప్రభువు తమకు గూడ జ్ఞానం భాగవతంలో అవధూతకు కల్గినట్లే కలిగిందని, అలా అన్ని రూపాలలో తమకు కలిగించినది దత్త ప్రభువేనని చెప్పారు. శ్రీ అక్కల్కోట స్వామి తామే శ్రీ నృసింహ సరస్వతి స్వామియని చెప్పడంలో శ్రీకృష్ణ సరస్వతియే వారి గురువని చెప్పినట్లయింది.

ఆధ్యాత్మికతలో చివరి స్థాయివరకూ యీ కృతజ్ఞతయే జీవనాడిగా పనిచేస్తుంది. అందుకే కృతజ్ఞతతో గురువును వారి కృపనూ స్మరించి తన శక్తి సామర్థ్యాలన్నీ ఆయన దానం చేసినవేనని అంగీకరించనివారు సాటిలేని కృతఘ్నులు, దొంగలు. వారికి అలా ధర్మమే లోపించినపుడు రాక్షసులే

అవుతారు. అట్టివారిని అందుకే ఆశ్రయించదగదని శాస్త్రం. అట్టివారికి ఆధ్యాత్మికతకు మొదటి మెట్టయిన సత్త్వగుణ, దైవీ సంపదలే అలవడలేదని చెబుతాయి. అట్టి కృతఘ్నతవల్లనే యితర దేవతలకంటే శక్తిమంతుడని చెప్పబడిన తాసీఫర్ అను దేవత సైతానయి నరకంలో పడ్డాడని ఇస్లాము, క్రైస్తవమూ హెచ్చరిస్తున్నాయి. అతనికి జీవులను భగవంతునిపట్ల కృతజ్ఞతకు బదులు దురహంకారం వైపుకి మళ్ళించుకొనే బుద్ధి కలిగింది. అతడి శక్తియంతా అందుకే వినియోగ పడుతున్నది. భగవంతుని అనుగ్రహంతో అపారమైన శక్తులు పొందినవారందరూ యిలాంటి కృతఘ్నతవల్లనే రాక్షసులయ్యారని పురాణాలు చెబుతున్నాయి.

ఒకవంక వేదాలు చదివి తపస్సు చేసి శక్తులు పొందిన రావణాసురుడు అవన్నీ తనకు లభించడానికి మూలకారణమైన ఋషులను దేవతలనూ ధిక్కరించి కించపరిచాడు, బాధించాడు. అందుకే అతడి వినాశమొక్కటే అతడికి తరుణోపాయమైంది, లోకానికి హితమూ అయింది. అట్టి కృతఘ్నత వలన అతడి జ్ఞానం ఫలించలేదు. మానవజాతి కంతటికీ చివరకు తనకు గూడ యిట్టి జ్ఞానమిచ్చిన ఋషులపట్ల అతడికి, అతడి అనుయాయులకూ తమోగుణ ప్రధానమైన వైరభావమే కల్గింది. పొడుగునా శ్రీరాముడు యిట్టి కృతజ్ఞతయొక్క ప్రతిరూపంగా, ధర్మమూర్తిగా జీవించాడు. మొదట రావణుడెంత విజృంభించినట్టు కన్పించినా అతడి స్థూలదృష్టికి, పామరుల దృష్టికీ సంసారలంపటుడుగా కన్పించిన రాముని ముందు నశించవలసి వచ్చింది.

ఇంతటి కృతజ్ఞత అనుక్షణమూ తన మాటలలోనూ చేతలలోనూ తెల్పుకొనగల సద్గురువు మాత్రమే ఆశ్రయించదగినవాడు. యోగి మిలారేపా తన గురువు మార్పాగారిపట్ల యిట్టి భావం వహించడం నేర్చేవరకూ ఆయన తన ముఖ్య శిష్యులకి చెప్పిన సాధనలే అతడు ఎంత చేసినా కించిత్తుగూడా జ్ఞానం కలగలేదు. కాకుంటే నేటి కపట గురువుల లాగ అతడు తనకు జ్ఞానం కల్గినట్లు నటించని నిజాయితీపరుడు గనుకనే తన తప్పు గుర్తించి ఏనాటికైనా జ్ఞానం పొందగల్గాడు. తననాశ్రయించిన గురువును దురహంకారంతో విడిచిపెట్టిన వాడొకడు శ్రీ గురుణ్ణి ఆశ్రయించినపుడు ఆయనందుకే "గురువును విడచిన నీవంటివాని ముఖం కూడా చూడకూడదు, ఫో అవతలకి!" అని ఛీదరించుకున్నారు. అతడు తన తప్పును గ్రహించి పశ్చాత్తాపంతో ప్రాణత్యాగం చేయడానికి సంసిద్ధుడయ్యాకనే శ్రీ గురుని అనుగ్రహం లభించింది. "ఒక గురువును పరిత్యజించినవాడిని మరే గురువూ చేరదీయడని గూడ శ్రీ గురుడు చెప్పారు. తమకు గురువే లేరని చెప్పుకునే సాధువులను, తమ గురువులను ధిక్కరించి తామే గురువులమని చాటుకొనేవారిని గూడ ఆశ్రయించే అమాయకుల గతి ఏమి కావాలి? అదే కలి ప్రభావమని పురాణాలు చెప్పాయి.

జగద్విఖ్యాతి గడించిన తర్వాత గూడ వివేకానందుడు తన ప్రసంగాలలో తాను చెప్పేది, సాధించినది – అంతా గూడ శ్రీ రామకృష్ణ పరమహంస పెట్టిన భిక్షేనని, తాను చెప్పేదానిలోనూ, ఆచరణలోను కన్పించే దోషాలు మాత్రమే తనవనీ స్పష్టంగా చెప్పారు. సరియైన సాంప్రదాయమంటే అదే! అదే నిజమైన కృతజ్ఞత. అందుకే తమ గురువు అనుగ్రహించిన మహిమను విని తాము కేవలమొక బిచ్చమెత్తుకునే ఫకీరు మాత్రమేనని సాయిబాబా సూక్తులు గూడ సూచిస్తాయి. అట్టి కృతజ్ఞత – అంటే గురుభక్తి, అంటే సదాచారం – లేనివారి బోధలెంత గొప్పగా వున్నా వారి నుండి వినరాదని శాస్త్రాలు చెబుతున్నాయి. గంగాజలమైనా మురికి గుంటలో పడ్డాక త్రాగడానికి పనికిరావు గదా – అన్నాయి.

గురువు నెన్నుకొనడంలో యింత జాగ్రత్త అవసరం. అటు తర్వాత మనమెంత సాధన చేసినా ఫలితం దీని పైననే ఆధారపడుతుంది. భక్తులిట్టి జాగ్రత్తలు తీసికొనక పోవడం వల్లనే యీనాడు వారెన్ని సాధనలు చేసినా సార్థకత పొందలేకున్నారు. అట్టి నిషిద్ధ గురువులను విడచి సత్సాంప్రదాయ మెరిగి పాటించేవారిని ఆశ్రయించడమొక్కటే మార్గం. అప్పుడు "నీవాశ్రయించిన గురువునెన్నడూ విడవకు. ఆయన మహిమ ఎంత తక్కువ దనిపించినా సరే, యితర గురువుల మహిమ ఎంత గొప్పదనిపించినా సరే!" అన్నారు సాయి. కాకుంటే మొదట గురువునెన్నుకునేప్పుడే శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన, నిర్దుష్టమైన గురుపరంపరకు చెందినవారినే ఎన్నుకోవాలి. ఇదంతా తెలియనప్పుడు 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేస్తూ ఆ విశ్వగురుడు ఆదేశించిన వారిని ఆశ్రయించడమొక్కటే యీ కలికాలంలో భద్రమైన మార్గం. ●

# పరిప్రశ్న

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

## ప్రశ్న :- దేముడంటే ఎవరు? ఎలా వుంటాడు? సాయిబాబానే ఎందుకు పూజించాలి?

*- బి. హైమావతి, వెంకటగిరి*

**జవాబు :-** నామరూపాలు లేనిది, సకల సృష్టికీ ఆధారమైనది, అంతటా తానై వుండే చైతన్య శక్తే భగవంతుడు. ఆ శక్తి మనలోనూ ఎరుక (ప్రజ్ఞ)గా కూడా వుంది. కానీ ఆ శక్తి స్థూలదేహము, దానికి పరిమితమైన మనస్సే అని భ్రమించినందువల్ల అసలైన భగవత్తత్త్వాన్ని గుర్తించలేకపోతాము. దీన్నే అజ్ఞానమంటారు. దాన్ని తొలగించి అసలైన భగవత్తత్త్వాన్ని గుర్తించేలా నిదర్శనా పూర్వకంగా నిరూపించి దానిని తెలుసుకొనేలా ప్రేరేపించగలవాడే సద్గురువు.

ఈ సత్యాన్ని ఈ కాలానికి అనుగుణంగా బోధించారు గనుకనే సాయిబాబాను పూజించడం శ్రేయస్కరమని నా విశ్వాసం. కాని తనను మాత్రమే పూజించమని సాయి ఎన్నడూ అనలేదు. సరిగా పూజిస్తే దేన్ని పూజించినా గమ్యం చేరుతారని బాబా చెప్పారు. మునుపు చెప్పిన భగవత్ తత్త్వం ఎవరిద్వారా మనకు మనస్సుకు హత్తుకునేట్లు తెలిసి తెలివిగా భక్తిశ్రద్ధలతో మనసు వారిపై నిలుస్తుందో వారినే సరిగా పూజించగలం! సర్వగతమైన ఆత్మ ఒకటున్నదని తమ లీలల ద్వారా సాయి నిరూపించినంతగా చరిత్రలో మరెవరూ నిరూపించలేదు. అందుకని ఆయన్ను పూజించడం శ్రేయస్కరమని మా విశ్వాసం. ●



(ఏప్రిల్ 2015 సాయిబాబా మాసపత్రిక నుండి)

# గృహస్థాశ్రమము

(గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారి వివాహ సందర్భంగా ప్రత్యేక వ్యాసం)

*పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

ఈ సృష్టి అతి విచిత్రమైనది. దీని ప్రక్రియ జన్మించుట, వసించుట, నశించుట. దీనిలో జన్మించుట లేకుండా మిగతా రెండూ వుండవు. అంటే జన్మించుట అనునది ఇందులోని అతి ప్రధానమైన అంశము.

అయితే ఈ సృష్టిలో అనేకానేక జీవరాశులు తమ జాతిని పెంపొందించుటకై పునరుత్పత్తి కొనసాగించేలా వ్యవస్థ ఏర్పడింది. ప్రతి జీవీ ప్రకృతి నిర్దేశించిన విధంగా ఈ ప్రక్రియను కొనసాగిస్తుంది. కానీ మానవుడు మేధస్సు కలవాడు గనుక ఈ ప్రక్రియను అత్యున్నతంగాను, అతి నీచంగానూ గూడా మలచుకోగలడు. అత్యున్నతంగా మలచుకున్నప్పుడు ఈ సృష్టిలోని ప్రతి జీవీ సుఖశాంతులతో వర్ధిల్లగలదు. అలా గాక దానిని మరో విధంగా మరల్చుకున్నప్పుడు ఈ సృష్టిలో అస్తవ్యస్తత తప్పదు. ఈ విషయాన్ని నిర్దుష్టంగా ఆలోచించి వేదఋషులు మానవుని వల్ల జరిగే ఈ సృష్టి ప్రక్రియను ఒక యజ్ఞంగా మలచారు. అదే వివాహక్రతువు. యజ్ఞ పూరితమైన మానవ జీవితం సృష్టియజ్ఞంలో అత్యున్నత స్థానాన్నాక్రమించి సృష్టి అంతటా శాంతిని నెలకొల్పుతుంది.

అందుకే సృష్టియజ్ఞ భాసస్థులైన మిగతా లోకాలవారు - దేవ గంధర్వాదులు కూడా - మానవులు చేసే ఇట్టి యజ్ఞ దీక్షను ఆకాంక్షిస్తుంటారు. కారణం, వారికి అట్టి అవకాశం లేదు గనుక! అయితే ఈ యజ్ఞంలో వారి పాత్ర లేకపోలేదు. వారి సహకారం లేనిదే ఈ సృష్టి కొనసాగదు. అందుకనే పెద్దలు 'పరస్పరం భావయంతః' అని చెప్పారు. కనుక ఈ వివాహక్రతువులో భాగంగా దిక్పాలకులతో ప్రారంభించి సకల దేవతలను ఆహ్వానించడం జరుగుతుంది. వారికి ఆహుతులను సమర్పించడం కూడా జరుగుతుంది. అందువల్ల వారు సంతుష్టి చెంది ఈ యజ్ఞానికి ఆశీస్సులు అందిస్తారు, ఎంతగానో సహకరిస్తారు.

వేదోక్త ప్రకారంగా ఈ సృష్టి యజ్ఞాన్ని కొనసాగించినవారు ఋషులు. అట్టి వారి జీవితమంతా ఒక తపస్సే. అట్టి తపోనిష్ఠులైనవారికి జన్మించేవారు అవతారపురుషులు, అవధూతలు, మహాత్ములు.

ఇందులో మహాత్ములకొక ప్రత్యేకత వున్నది. వీరిని అందరికంటే ఉత్తమశ్రేణిగా చెప్పక తప్పదు. కారణం అవతారపురుషులు ఈ సృష్టిలో ధర్మగ్లాని కలిగినపుడు అందుకు తగిన అవతారమెత్తి ధర్మాన్ని ప్రతిష్ఠించి నిష్క్రమిస్తారు. అవధూతలు ఆత్మావలోకమునందు నిమగ్నులై, తమలో తాము ఆత్మానందాన్ని గ్రోలుతుంటారు. అట్టివారివలన అంతర్లీనంగా ఈ సృష్టికి శ్రేయస్సు కలుగుతున్నప్పటికీ ఎక్కువగా సృష్టిలో మార్పు కనిపించదు.

అలాగాక మహాత్ములు ఈ సృష్టిలో ధర్మోద్ధరణను సంకల్పించి అవతరిస్తారు. కనుక వారు ప్రతి జీవినీ ఉద్ధరించడానికి ప్రత్యేక ప్రయత్నాలు చేస్తారు. అందులో ప్రధానమైన భాగంగా మానవ జీవితాలను ఉత్తమంగా మలచబూనడం వీరి యొక్క లక్ష్యం. ఆయా దేశకాలపరిస్థితుల

ననుసరించి మానవులకు సరియైన మార్గమును నిర్దేశిస్తారు.

గృహస్థాశ్రమం అతి విశిష్టమైనది, అతి క్లిష్టమైనది కూడా. దీనిని సరిగ్గా నిర్వహించలేకపోతే ధర్మగ్లాని సంభవిస్తుంది. ఇతర ఆశ్రమాల వలన అంతటి ప్రమాదం వుండదు. కారణం, ఒక బ్రహ్మచారి తన ఆశ్రమ ధర్మాలను తప్పితే అతనికి, మరికొద్దిమందికి మాత్రమే నష్టము వాటిల్లుతుంది. అలాగే సన్యాసి తన ధర్మం తప్పినా కూడా. కానీ ఒక గృహస్థు తన ధర్మాన్ని తప్పినట్లైతే అట్టివారి సంతానం వలన సమాజానికి తీరని నష్టం కలుగుతుంది. ధర్మభ్రష్టులైన సంతతి వల్ల సమాజం అస్తవ్యస్తమై అనేక విధాలుగా కష్టనష్టాలకు లోనౌతుంది.

గృహస్థాశ్రమంలో మిగతా ఆశ్రమాలలో వలెనే విధి నిషేధాలుంటాయి. అంతేగాక బ్రహ్మచారుల, సన్యాసుల జీవనం కూడా ఈ గృహస్థాశ్రమ జీవనం మీదే అధారపడివుంటుంది. వారిని పోషించవలసిన బాధ్యత – గృహస్థులదే. ఈ ఆశ్రమంలో కుటుంబంలోని సభ్యులందరూ ఏకతాటిమీద నిలువవలసి వుంటుంది. ఎవరికి వారు వారికిష్టమైన రీతులలో ప్రవర్తిస్తే అది సరియైన సంసారము కాజాలదు. ఒడిదుడుకుల బాటయే అవుతుంది. అందుకని ఎవరు ఏఏ విధులను నిర్వర్తించాలో మన వేదఋషులు ఖచ్చితమైన పద్ధతిలో నిక్కచ్చిగా చెప్పారు. యజమాని యొక్క ధర్మము, యజమానురాలు యొక్క ధర్మము, పెద్దల ధర్మము, పిల్లల ధర్మము కూడా చక్కగా చెప్పారు. వారు చెప్పిన ప్రకారం ఆలోచించి ప్రయత్నిస్తే కుటుంబం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. ఆలోచించకుండా గుడ్డిగా నమ్మినా అలాగే వుంటుంది. కాని దీనిలో కొంత ప్రమాదం పొంచివుంటుంది. ఏమైనా ఎందుకు చేయాలో, ఎందుకు చేయకూడదో తెలియకపోతే ఎప్పుడైనా 'అసలు ఎందుకు చెయ్యాలి? చెయ్యకపోతే ఏమి?' అనిపించవచ్చు.

నేటి సమాజంలో జరుగుతున్నదదే. ఏది ఎందుకు చెయ్యాలో చెప్పేవారు లేకపోవడం చేత ప్రతివారు వారివారి ఇష్టానుసారం ప్రవర్తించడం జరుగుతున్నది. దాని ఫలితంగా నేటి సమాజంలో ఎవరికీ ఏ విషయంలోనూ భద్రత లేదు. అందుకని శాంతి లేదు. అందుకని ప్రతి మనిషి అనేక సమస్యలలో చిక్కుకుని తత్ఫలితంగా మానసిక శాంతిని కోల్పోయి అవతలవారిమీద కోపగించుకోవడం జరుగుతుంది. దీనిలో ఎవరిది ఎప్పుడు పైచేయి అయితే వారి అధికారం నడుస్తుంది. అందుకని అవతలివాడు సమయం కోసం వేచివుండి అవకాశం వచ్చినప్పుడు అధికారం చెలాయిస్తాడు. ఇది సమాజంలో అన్ని రంగాలలోనూ తాండవిస్తున్నది.

అంతేకాదు, ఇది నేడు ప్రతి ఇంట్లోనూ జరుగుతున్న భాగోతమే. ఎవరికి వారు వారి సంస్కారాలననుసరించి ప్రవర్తించడంవల్ల ఇంట్లో ఏ ఒక్కరికీ ఇతరులతో పడదు. ప్రతి విషయంలోనూ సంఘర్షణే. ఈ తగవులు ప్రతి రోజూ సంభవిస్తున్నప్పటికీ ఎవ్వరూ తగ్గరు, ఊరుకోరు. ఏ విషయంలోనైనా ఎవరిది వారికే సరి అనిపిస్తుంది. తన మాట, తన చేత సరియైనవి అనిపించడం వల్ల తాను తగ్గాలనిపించదు, ఊరుకోవాలనిపించదు.

అందుకని చిన్న ప్రపంచ సంగ్రామం కుటుంబంలోని వ్యక్తుల మధ్య జరుగుతూనే వుంటుంది. ఇలా తగవులతోనే జీవితకాలమంతా గడిచిపోతుంది. వీటి వలన కలిగే మానసిక అశాంతితోనే జీవుడు మరణిస్తాడు. ఇట్టి ప్రమాదాన్ని ఆలోచించారు కనుకనే మన పెద్దలు నిర్దుష్టమైన జీవిత విధానాన్ని ఆదేశించారు. ఎవరి ధర్మాలను వారు తప్పక నిర్వహించాలని చెప్పారు.

పెద్దలు చెప్పిన విధంగా నడుచుకుంటే కుటుంబంలోని అందరూ సుఖశాంతులతో జీవిస్తారు. అట్టివారిని ఆదర్శంగా తీసుకుని మిగతావారు అనుసరిస్తారు. క్రమంగా సమాజంలోని వారు సుఖశాంతులతో జీవిస్తారు.

వేదప్రోక్త ఉత్తమ గృహస్థ ధర్మాన్ని ఆచరించి తమ జీవితాన్ని యజ్ఞంగా మలచుకున్నవారు శ్రీమాన్ ఎక్కిరాల అనంతాచార్యులవారు. అందుకనే మహాత్ములైన పూజ్య ఆచార్య శ్రీ భరద్వాజ మాస్టరుగారు వారికి పుత్రుడుగా జన్మించారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు అత్యున్నత గృహస్థాశ్రమాన్ని గడిపారు. ఆయన ఆధ్యాత్మిక జీవితాన్నే ఎంచుకున్నప్పటికీ లౌకిక జీవితాన్ని నిర్లక్ష్యం చేయలేదు. మానవ జీవితం సక్రమంగా నడవడానికి ఆధ్యాత్మికత, లౌకికత రెండూ రెండు కాళ్ళవంటివని, అలా లేని జీవితం కుంటినడక వంటిదనీ ఆయన చెప్పేవారు. అంతేగాక ఆధ్యాత్మికత లేనిదే లౌకిక జీవితం సరిగ్గావుండదు. అందుకని "ఆధ్యాత్మికత అన్నది పునాది వంటిది. అది లేని లౌకిక జీవితం పతనం కాక తప్పదు" అని గూడ ఆయన చెప్పేవారు.

"నేటి సమాజంలో ధర్మబద్ధమైన లౌకిక జీవితం సాధ్యమా? కుటుంబంలోని వ్యక్తులు తలా ఒక వైపు,

సమాజంలోని వ్యక్తులు తలా ఒక వైపు లాగుతుంటే ఎవరి జీవితమైనా ధర్మబద్ధంగా ఎలా నడుస్తుంది?" అన్న ప్రశ్న కలగడం సహజమే.

అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఇలా చెప్పారు: "ఆ మాట నిజమే. ఈ కలికాలంలో చాలా కష్టమే. కానీ ధర్మబద్ధమైన జీవితంలో వుండే సుఖశాంతులను అవగాహన చేసుకున్నవాడికి అది కష్టమనిపించదు. అట్టివాడు సమాజానికి ఎదురీదుతాడు."

కన్యాశుల్కము, వరకట్నము, సతీసహగమనము, బాల్యవివాహాలు, మొదలైన దురాచారాల నిషేధం కోసం, స్వాతంత్ర్య పోరాటాలు మొదలైన వాటిని సంస్కరించడానికి ఎందరో తమ జీవితాలను పణంగా పెట్టి సమాజానికి ఎదురీది సమాజంలో మార్పులు తెచ్చారు. వారే సంఘసంస్కర్తలు. ఆ విధంగా ఎవరూ పూనుకోకపోతే సంఘం ఎలా ఉద్ధరింపబడుతుంది? అందుకని అట్టి శ్రేయస్సును ఆకాంక్షించేవాడు సమాజానికి ఎదురు నిలబడితీరాలి. అందుకు మనమే సంసిద్ధులం ఎందుకు కాకూడదు? ఒకరు దృఢ సంకల్పంతో నిలబడితే మరికొందరు వారిని అనుసరిస్తారు. అందుకని 'ఇది సాధ్యమా' అనుకోవడంలో మన సంకల్పం బలహీనంగా వున్నదన్నమాట. నేటి సమాజ పరిస్థితులను చూస్తున్న వారికెవరికైనా దానిలోని అస్తవ్యస్తత కనిపించక తప్పదు. మరి దానిని తొలగించుకోడానికి మనము ఎందుకు పూనుకోకూడదు? 'మనకెందుకు అంతటి కష్టం? ఎవరైనా చేస్తే అనుభవిద్దాములే' అని చాలామందికి అనిపిస్తూవుంటుంది. అంటే ఎవరో కష్టపడితే మనము సుఖపడాలన్న స్వార్థం మనలో దాగివున్నదన్నమాట. అట్టి స్వార్థం వల్లనే అందరికీ అట్టి స్వార్థ బుద్ధి కలిగి ఎవరూ ముందుకు అడుగువేయలేక పోతున్నారు. 'మనం కష్టపడాలేమో! ఎందుకు పడాలి?' అన్న స్వార్థం ప్రక్కకి పెడితే ఈనాడు మనము పడుతున్న అన్యాయాలు, అక్రమాలనుండి మన బిడ్డలైనా, బిడ్డలబిడ్డలైనా సుఖశాంతులతో మనగలిగేలా ప్రయత్నించినవారమౌతాము. లేకపోతే మనకంటే ఎక్కువ కష్టనష్టాలకు గురయ్యే ప్రమాదం ముందు తరాలవారికి సిద్ధంగా పొంచివుంది అన్నది అక్షరసత్యం. ఇది చాలామంది విజ్ఞాన శాస్త్రవేత్తలు, ఆధ్యాత్మికవేత్తలు హెచ్చరిస్తూనే వున్నారు.

అందుకు ప్రారంభం మన ఇంటినుంచే జరుగవలసివున్నది. ప్రతి ఇంటిలోని వారు ధర్మబద్ధమైన జీవితం గడపడానికి ప్రయత్నించాలి. అదే సమాజ ఉద్ధరణ. ఈనాడు ప్రతి రంగంలోనూ జరుగుతున్న కాలుష్యం అప్పుడే సమసిపోగలదు. ఉదాహరణకి ఒక్క విషయం చెప్పుకుందాము. తన భార్యను తప్ప ప్రతి స్త్రీని సోదరిగానూ, తల్లిగానూ చూసుకోవడం ప్రారంభిస్తే ఈనాడు జరుగుతున్న అత్యాచారాలు తత్ఫలితమైన హత్యాకాండలు నిర్మూలింపబడతాయి. అలాగే మిగతా విషయాలలో కూడా ఆలోచిస్తే అవి గూడ నిర్మూలింపబడతాయి.

అందుకని అత్యున్నతమైన గృహస్థాశ్రమం నిర్వర్తించడానికి ప్రతివారూ ప్రయత్నించాలి. యజమాని మాత్రమేగాక ఇంట్లోని వారందరూ కూడా ప్రయత్నించాలి. అందుకు గృహస్థు ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడానికి నిర్ణయించుకోవాలి. యజమాని గట్టివాడైనప్పుడు తక్కినవారు అనుసరించక తప్పదు. 'రౌతు మెత్తనివాడైతే ఆ గుర్రం మూడు కాళ్ళమీద నడుస్తుంది' అనే సామెత ఉన్నది కదా! అయితే గృహస్థు బలవంతాన ఎవ్వరితో ఏదీ చేయించకూడదు. ఇంట్లోని ప్రతివారికీ ధర్మంపట్ల అవగాహన కలిగించాలి. అప్పుడే ఇంట్లోని వారు మనస్ఫూర్తిగా యజమాని మాటను పాటించగలరు. అట్టి కుటుంబాలు గల సమాజాన్ని ఒక్కసారి ఊహించుకుంటే మనకే అట్టి సమాజం ఎలావుంటుందో అవగతమౌతుంది.

కనుక గృహస్థాశ్రమంలో వున్నవారు, కొత్తగా స్వీకరించిన వారు, స్వీకరించబోయేవారు కూడా ఈ విషయాన్ని తప్పక ఆలోచించి తీరాలి. అందుకు తగిన దీక్ష పూనాలి. దక్షతతో వ్యవహరించాలి.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఒకవైపు ఆధ్యాత్మిక జీవితాన్ని, మరోవైపు లౌకిక జీవితాన్ని కూడా సాటిలేని విధంగా అత్యున్నతంగా నిర్వర్తించారు. ఆయన జీవితాన్ని పరిశీలిస్తే కొంతవరకు మన జీవితాలను సరిదిద్దుకోవడానికి అవగాహన కలుగుతుంది. అట్టి అవగాహనతో ముందుకు సాగితే ఆయన బాటలో పయనించిన వారమౌతాము. అట్టివారిని ఆయన చేయిపట్టి నడిపిస్తారన్నదాంట్లో సందేహము లేదు.

అందుకే నేటినుంచీ ప్రతివారూ ఆయన నిర్దేశించిన బాటలో పయనించడానికి ప్రయత్నిద్దాము. సుఖశాంతులతో వుందాము.

జై సాయి మాస్టర్!

# మాతృదేవి స్మృతులు

*సైదారెడ్డి దంపతులు*

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లితో తమ స్మృతులను, అనుభవాలను నాగోలు సత్సంగ సభ్యులు శ్రీమతి రమ, శ్రీ సైదారెడ్డి దంపతులు, ఈ విధంగా తెలియచేస్తున్నారు.

***శ్రీమతి రమగారి అనుభవాలు:-***

మాది నల్గొండ జిల్లా లో ఒక పల్లెటూరు. మాకు మహాత్ములు అంటే ఏమాత్రం అవగాహన లేదు. పెళ్ళైన తరువాత హైదరాబాదుకు వచ్చాము. మా ఇంటికి దగ్గరలో శ్రీమతి సుభద్రమ్మగారు వాళ్ళు వుండేవారు. మావారికి వాళ్ళు బాగా తెలుసు. సుభద్రమ్మగారు నాకు పూజ్యశ్రీ అమ్మగారి గురించి చెప్పి దర్శనానికి రమ్మనేవారు. కానీ నేను శ్రద్ధ చూపించలేదు. కొన్నాళ్ళకి మా మరిది చనిపోయాడు. నాకు చాలా బాధగా వుండి బాగా ఏడ్చేదాన్ని. అప్పుడు ఒకసారి సుభద్రమ్మ గారు మా ఇంటికి వచ్చి, "ఇలా ఏడుస్తూవుంటే ఎలాగ? నేను ఇప్పుడు మల్కాజిగిరి అమ్మగారి దర్శనానికి వెడుతున్నాను" అని రమ్మనమని తీసుకెళ్లారు. పూజ్యశ్రీ అమ్మగారిని నేను దర్శించుకోవడం అదే మొదటిసారి. తరువాత పూజ్యశ్రీ అమ్మగారు నాగోలుకి వెళ్ళిపోతే, సుభద్రమ్మగారు వాళ్ళు కూడా వెళ్లిపోయారు. ఎప్పుడైనా నాగోలు వాళ్ళ ఇంటికి వెళ్లినప్పుడు పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకొనేదాన్ని. నెమ్మది నెమ్మదిగా అక్కడి వాతావరణం, గురుకుటుంబం ప్రేమాభిమానాలు చూసిన తరువాత, దర్శనానికి వెళ్లలేకపోతే ఏడుపువచ్చే పరిస్థితి వచ్చింది. మావాళ్లు మమ్మలిని ఊరికి వచ్చెయ్యమని గొడవచేసారు. నాకైతే ఎట్టి పరిస్థితిలోనూ వెళ్లడం ఇష్టం లేదు. నాదగ్గర మా అక్క కొడుకు, మా తమ్ముడు వున్నారు. అందుకని నేను ఇక్కడే వున్నాను. మావారు వూరికి వెళ్లారు. అంటే అలాగైనా నేను ఇక్కడే ఉండిపోవటానికి సిద్ధమయ్యాను. ఒకసారి మా కజిన్ సిస్టర్ పెళ్ళికి వెళ్ళవలసి వచ్చింది. ఇక తప్పదు కదా, అని బయలుదేరాను. మనసులో అస్సలు ఇష్టంలేదు. అప్పుడు నాకు ఎనిమిది సంవత్సరముల బాబు, ఐదు సంవత్సరముల పాప వున్నారు. మా ఊరు వెళ్ళాక జ్వరం వచ్చి, వెళ్లిన ఐదు రోజులకే మా పాప చనిపోయింది. ఇంక కొన్నాళ్ళకి పూర్తిగా హైదరాబాదు వచ్చేసాము.

అప్పటికి పూజ్యశ్రీ అమ్మగారికి ఒంట్లో బాగోలేక గాంధీనగర్ లో వున్నారు. మేము కూడా అక్కడకి వచ్చి పూజ్యశ్రీ అమ్మగారు నాగోలుకి వచ్చినప్పుడు మేము కూడా నాగోలుకి వచ్చేసాము. మా అబ్బాయి జగదీష్ ఇక్కడే గురుకులంలో చదువుకున్నాడు. పూజ్యశ్రీ అమ్మగారి పరిచయ భాగ్యం కలిగిన కొత్తలో, ఈ వాతావరణం చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉండేది. ఎక్కడెక్కడినించో వచ్చిన వాళ్ళందరూ కలిసి ఉండటం, పిల్లలందరూ, ఒకేచోట, ఇంట్లోనే విద్య నేర్చుకోవడం, ఇలా ఇక్కడ తప్ప ఇంకెక్కడా జరగదు అనిపిస్తుంది. పైగా అందరిపైనా సమానమైన ప్రేమ చూపించే పూజ్యశ్రీ అమ్మగారు, గురుకుటుంబం, ఇప్పటికీ నాకు ఇదొక బృందావనంలా అనిపిస్తుంది. పూజ్యశ్రీ అమ్మగారి చల్లని నీడలో పూజలు, పండుగలు, విందులు వినోదాలు, చదువులు, సత్సంగాలు, సేవలు వీటన్నింటితో జీవితం ఉత్సాహభరితంగా సాగిపోతోంది. ఎటువంటి ఆపద వచ్చిన వెన్నంటి నిలిచే గురుకుటుంబం, సత్సంగ సభ్యులు!!

ఇక్కడికి వచ్చాక ఒకసారి, వేసవికాలంలో, యూరిన్ రాక నేను చాలా బాధ పడ్డాను. మా దగ్గర సత్సంగ సభ్యులు యోగ గారు హోమియో మెడిసిన్ ఇస్తారు. నేను వారిని అడిగి మందు తీసుకున్నాను. రెండు రోజులకి కొంత నెమ్మదించినా పూర్తిగా తగ్గలేదు. ఒక వారం చూసాక "మీరు హాస్పిటల్ కి వెళ్లడం మంచిది, అవసరమైతే ఆపరేషన్ చేయవలసి వస్తుందేమో!" అన్నారు. నాకు హాస్పిటల్ అంటే చాలా భయం. వెంటనే నేను, "ఎట్టిపరిస్థితులలోనూ, నేను హాస్పిటల్ కి వెళ్ళను, మీరే మందివ్వాలి" అని చెప్పాను. అలాగే కొన్నాళ్ళకి పూర్తిగా తగ్గింది. అప్పుడు యోగ అన్నయ్య, "మీరు హాస్పిటల్ కి వెళ్లనన్నాక, పూజ్యశ్రీ అమ్మగారికి దణ్ణం పెట్టుకున్నాను, తగ్గించమని. పూజ్యశ్రీ అమ్మగారి దయ లేకపాతే ఇది తగ్గేది కాదు" అని చెప్పారు. నేను కూడా నమస్కారం చేసుకుంటున్నాను. కానీ ఆయన కూడా అలా చెప్పేసరికి, ఖచ్చితంగా అమ్మగారి దయ అని నిరూపణ ఇచ్చినట్లయ్యింది.. మా అబ్బాయి ఒకసారి మేడ పైనించి పడిపోయాడు. అప్పుడే సందులో వున్న చెట్లన్నీ సగానికి కొట్టేశాము, ఒకచెట్టు కోసుగా చెక్కివుంది. వాడు సరిగా దాని పక్కనే పడ్డాడు, ఏమాత్రం తేడా వచ్చినా,,,,చాలా ప్రమాదం జరిగేది. నాకు వేరే ఆలోచన రాలేదు. వెంటనే పళ్ళు, పూలు పూజ్యశ్రీ అమ్మగారికి సమర్పించుకుని నమస్కారం చేసుకున్నాను.

కరుణయే తన స్వరూపంగా కలిగిన అలివేలుమంగమ్మ తల్లికి కృతజ్ఞతాపూర్వకపాదాభివందనములు తెలియచేసుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!

***శ్రీ సైదారెడ్డి గారి అనుభవాలు:-***

ముందుగా అమ్మగారికి పాదాభివందనములు. ఆ తల్లి దయవల్ల ఈ మార్గంలోకి రాగలిగాను. ముందు మా శ్రీమతి, పిల్లలు దర్శనానికి వెడుతుంటే, బయట దింపేసి వెళ్లిపోయేవాడిని. ఒకసారి నాగోలు శివపురి కాలనీలో పూజ్యశ్రీ అమ్మగారు అనుగ్రహభాషణం చేస్తున్నారు, సాయంత్రం ఏడుగంటల ప్రాంతంలో. నేను మొదటిసారి కాంపౌండ్ లోపలకి వెళ్లాను. కానీ సత్సంగ హాలులోకి వెళ్ళకుండా, బయటనే కూర్చున్నాను. సత్సంగం అయ్యాక, పూజ్యశ్రీ అమ్మగారు అందరికి విభూది, ప్రసాదం ఇస్తున్నారు. నాకు వెళ్ళడానికి భయం వేసింది. ఎందుకంటే, వాళ్లకి అన్ని తెలిసిపోతాయి. నేనేమో మామూలు జీవితం గడిపేవాడిని. నన్ను చూసి ఏమనుకుంటారోనని భయం. మొత్తానికి పూజ్యశ్రీ అమ్మగారి నించి విభూది, ప్రసాదం తీసుకున్నాను. చిత్రమేమంటే మరునాడు ఉదయం నిద్ర లేవగానే మనసు చెప్పలేని ఆనందం, శాంతులతో నిండిపోయింది. ఆ రోజు పనులన్నీ చాలా హుషారుగా, తొందరగా చేయగలిగాను. అప్పుడనిపించింది.. అమ్మగారు చాలా గొప్పవారని! ఇది నా మొట్టమొదటి అనుభవం.

మా కుటుంబాన్ని ఊరికి తీసుకెళ్లిపోవాలని నేను చాలా ప్రయత్నం చేసాను. పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర అనుభవం జరిగినా, మనస్సుకి స్థిరత్వం రాలేదు. కానీ నా ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఒకసారి నాకొక కల వచ్చింది. అందులో ఒకాయన "ఇరవై రోజులలో నీకు గండం ఉంది" అని చెప్పారు. ముందు భయం వేసింది. తరవాత 'ఏం జరుగుతుందో చూద్దాం' అనుకున్నాను. పదిహేను రోజులకల్లా మమ్మల్ని నాగోలు రమ్మన్నారు. అప్పటికి మేము వూరు వెళ్లడం, వెనక్కి రావడం జరిగింది. మా ఆవిడ నాగోలులో ఉందామన్నా కూడా నేను వేరే చోట ఇల్లు తీసుకున్నాను. అయినా కానీ, పూజ్యశ్రీ అమ్మగారు ఎంతో కరుణతో మాకు నాగోలు వచ్చే అవకాశం ఇచ్చారు. వచ్చిన కొన్నిరోజులకే నాకు డెంగ్యూ జ్వరం వచ్చింది. హాస్పిటల్ లో జాయిన్ అయ్యాను. లక్ష నించి ప్లేట్లెట్స్ వెంట వెంటనే పదహారు వేలకి పడిపోయాయి. అప్పుడు గురుకుటుంబం, సత్సంగసభ్యులు ఎంతగానో ఆదుకున్నారు. నాకు రక్తదానం కూడా చేశారు. అందరి దయవల్ల కోలుకున్నాను. అదే నేను బయట ఉంటే ఏమయ్యేదో ఊహించుకుంటేనే భయంకరంగా ఉంటుంది. పూజ్యశ్రీ అమ్మగారి చల్లని నీడలో వున్నాం కనుక, ఎన్నెన్నో పరిస్థితులనించి రక్షింపబడుతున్నాము.

పూజ్యశ్రీ అమ్మగారి పైన, గురుకుటుంబం పైన భక్తి విశ్వాసాలు చెదరకుండా ఉండేలా వరమిమ్మని ఆ తల్లినే మనస్ఫూర్తిగా వేడుకుంటూ, నమస్సుమాంజలి ఘటిస్తున్నాను.

జై సాయి మాస్టర్!!

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 11వ ప్రసంగము

### చిత్తైకాగ్రతకు స్థూల మనోవృత్తులను క్రియాయోగం ద్వారా సూక్ష్మము చేయాలి

డా. వీ. :- చిత్తము ఏకాగ్రత పొందడము కోసం ప్రయత్నిస్తున్నాను, కానీ ఏకాగ్రత కుదరడం లేదు అది ఎలా కుదురుతుంది?

స్వా.ని. :- సంసారంలో వున్న జీవుల చిత్తము స్వభావసిద్ధంగా స్థూలంగా వుంటుంది. వస్త్రములు మొ॥న వాటి మీద ఎక్కువగా మురికి పట్టినట్లుగానే వారి చిత్తంలో విషయవాసన, మమకారము మొ॥నవి ఎక్కువగా వుండడం వలన ఇష్టమైనవి దూరమవడం (ఇష్టవస్తు వియోగము), ఇష్టములేని వాటితో వుండవలసిన రావడము (అనిష్టవస్తు సంయోగము) మొ॥న అనేక రకాల సంసారికమైన ఉపాధుల కోసం వారి మనసులో ఎక్కువగా మాలిన్యము చేరుతుంది. చిత్తము ఎక్కువగా చంచలమౌతుంది. అది చిత్తం యొక్క స్థూలత్వంగా చెప్పబడుతుంది.

*అనాత్మన్యాత్మభావేన దేహభావనయా తథా ।*
*పుత్ర దారైః కుటుంబైశ్చ చేతో గచ్ఛతి పీనతామ్ ॥*
*అహంకార వికారేణ మమతా మలలీలయా ।*
*ఇదం మమేతి భావేన చేతో గచ్ఛతి పీనతామ్ ॥*

(యో, వా.)

భావం : అనాత్మ పదార్థాల పట్ల ఆత్మబుద్ధి కలిగి వుండడం, శరీరము పట్ల ఆత్మబుద్ధి (శరీరమే తాననే భావన) పిల్లలు, భార్య, కుటుంబము మొ॥న వాటిలో మోహము, మమకారము కలిగి వుండటం – వీటి వలన చిత్తము స్థూలత్వాన్ని పొందుతుంది.

ఈ స్థూల చిత్తము కలవాడు మొదట క్రియాయోగము చేత చిత్తాన్ని సూక్ష్మంగా చేసుకోవాలి.

*"తపః స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని క్రియాయోగః"* అని యోగసూత్రాలు చెబుతున్నాయి. తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము – ఈ మూడూ క్రియాయోగము అనబడతాయి. వేద సంహిత, రుద్రము మొ॥నవి అధ్యయనం

చేయడము, ప్రణవము మొ॥న మంత్రాలను జపం చేయడం, ఈశ్వరుడు ప్రసన్నుడు అవ్వడానికి ప్రతిఫలాన్ని ఆశించకుండా వర్ణాశ్రమ ధర్మాలను అనుష్ఠించడం – ఇది క్రియాయోగము. ఈ క్రియాయోగాన్ని ఎక్కువకాలం ఎల్లప్పుడూ శ్రద్ధాభక్తులతో ఆచరిస్తే చిత్తవృత్తి స్థూలత్వాన్ని విడిచి సూక్ష్మతరమౌతుంది. అంటే ఏకాగ్రత చెందుతుంది.

## తగిన క్రియాయోగము చేత చిత్తము ఏకాగ్రత పొందుతుంది

*శ్లో॥ ఏకాగ్రశ్చేత్ గ్రాహ్యాదౌ,*
*నిరోధశ్చేత్ చిదాత్మని।*
*క్షిప్తాదిత్రిభవస్త్యాగాత్*
*కస్య మోక్షోఽత్ర దూరతః ॥*

భావం : దేహము మొ॥న వాటియందు ఏకాగ్రత కలిగి వుండి, చిదాత్మ యందు నిరోధము కలిగి, క్షిప్తము మొ॥న మూడు అవస్థలను త్యజించినట్లయితే మోక్షము ఎంతో దూరముండదు.

**క్షిప్తము** *:* రజోగుణ ప్రధానమైనందువలన శబ్దము మొ॥న పంచవిషయాలలో అనురాగము కలిగివుండడం, లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన – ఈ మూడింటి యందు ప్రవృత్తికల మనస్సు 'క్షిప్తము' అని పిలవబడుతుంది.

**మూఢత్వము** *:* తమోగుణ ప్రాధాన్యము చేత కృత్యాకృత్య విచారము చేయకుండా (ఈ పని చేయదగినది, ఈ పని చేయకూడదు అనే విచక్షణ లేకుండా) అధర్మము పట్ల ప్రీతి కలిగి నిద్ర, తంద్ర (సోమరితనము) మొ॥న దోషాలకు లోబడు మనస్సు మూఢత్వము కల మనస్సు అని చెప్పబడుతుంది.

**విక్షిప్తము** *:* సత్వగుణ ప్రాధాన్యము చేత దుఃఖాన్ని కలిగించే సాధనాలను విడిచివేయడము, సుఖాన్ని కలిగించే వాటిని పొందడము అనే వాటి పట్ల ప్రవృత్తి కలిగివుండే మనస్సు విక్షిప్తము.

**ఏకాగ్రము** *:* ధ్యేయమునుంచి పక్కదారి పట్టించే వృత్తులను నిరోధించేది, ఆత్మ ప్రకాశాన్ని కలిగించే నిరోధావస్థను కలిగించే #సంప్రజ్ఞాత సమాధి ఏకాగ్రత అనబడుతుంది.

**నిరుద్ధము** *:* అన్ని వృత్తులను నిరోధించడము వలన కలిగిన# అసంప్రజ్ఞాత సమాధి.

## విషయేచ్ఛ త్యజించనిదే బ్రహ్మ సుఖము లేదు

డా॥ వీ॥ : విషయసుఖము అనుభవిస్తూ బ్రహ్మసుఖాన్ని అనుభవించే అవకాశమే లేదా?

స్వా॥ ప్ర॥ : తన ముక్కులో మాలిన్యాన్ని వుంచుకొని, ఎదుట అత్తర్లు, సెంట్లు, పూలు మొ॥న సుగంధ ద్రవ్యాలు వుంచుకుంటే వాటి సుగంధాన్ని ఎవరైనా అనుభవించగలరా? మానవుడు విషయాలలో ఆసక్తి కలిగి, అల్పమైన సుఖాన్ని అనుభవించేటప్పుడు మహత్తరమైన బ్రహ్మసుఖాన్ని అతడు అనుభవించలేడు.

## బాహ్యస్పర్శను త్యజించటం వలన అక్షయమైన (నాశము లేని) సుఖము కలుగుతుంది

భగవంతుడు ఇలా చెప్పాడు: –

*శ్లో॥ బాహ్య స్పర్శేష్వసక్తాత్మా*
*విన్దత్యాత్మని యత్సుఖమ్ ।*
*స బ్రహ్మయోగ యుక్తాత్మా*
*సుఖమక్షయ్యమశ్నుతే॥*

---

*# సమాధి రెండు విధాలు – సంప్రజ్ఞాత సమాధి, అసంప్రజ్ఞాత సమాధి.*

***సంప్రజ్ఞాత సమాధి*** *వలన ప్రకృతిని వశపరచుకోవడానికి కావలసిన శక్తులన్నీ లభిస్తాయి. అది మోక్షప్రదం కాదు. ఈ సమాధిలో నేను అనే జ్ఞానం యింకా భాసిస్తూవుంటుంది. సంస్కార బీజాలు వుంటాయి.*

***అసంప్రజ్ఞాత సమాధి*** *– దీనిలో నేను అనే అహంకారం వుండదు. బీజరూపంలో వుండే చిత్తవృత్తులు నశిస్తాయి. కర్మబీజం వుండదు. దీనిలో వాసనలు నశించి మనోనాశము కలగడం వలన, యోగి పరమాత్మను తెలుసుకొని ముక్తిని పొందుతాడు.*

భావం : బాహ్య విషయాలను అనుభవించడంలో ఎవరి మనసు ఆసక్తిని పొందదో ఆ వ్యక్తి ఆత్మయందే ఆనందాన్ని పొందుతాడు. బ్రహ్మ సాక్షాత్కారము పొందిన ఆ మానవుడు అక్షయమైన (నాశము లేని) సుఖాన్ని పొందుతాడు.

ఇంద్రియ స్పర్శగల విషయాలు శబ్దము మొ॥నవి. అవి అనాత్మ రూపాలు కావడం వలన విడిచివేయదగినవి. శబ్దము మొదలైన వాటియందు ఆసక్తి లేనివాని అంతఃకరణంలో చిత్తచాంచల్యము లేనందువలన, శాంతి స్థాపించబడివుండటం వలన సుఖానుభవం కలుగుతుంది. ఇలా తృష్ణ లేని వాడవడం వలన ఆ మానవుడు సమాధి స్థితిలో పరమాత్మ స్వరూపంతో తన అంతఃకరణాన్ని ఐక్యం చేయడానికి సమర్థుడౌతాడు. ఆ సమాధి యొక్క అభ్యాసము పరిపక్వమైతే నిర్వికల్ప సిద్ధికి చేరుతుంది. అప్పుడు నాశనము కాని గొప్పదైన ఆత్మసుఖాన్ని పొందుతాడు. అంటే విషయపదార్థాల నుండి ఆసక్తి పోనిదే చిత్తము ఏకాగ్రము కాదు. శాంతి, సుఖము కలుగదు. ఇక నిర్వికల్ప సమాధి మాట ఏమి చెప్పగలము?

## అజ్ఞానము చేత దుఃఖపూరితాలైన విషయపదార్థాలందు సుఖము భాసిస్తుంది

విషయ పదార్థాలలో ఏ విధమైన సుఖము లేదు. వాటిలో సుఖము కలుగుతుందని భావించడం ఒక భ్రాంతి. కుక్క ఎండిన గట్టి ఎముక ముక్కను కొరుకుతుంది. ఆ తరుణంలో దాని నోటి నుండి ఒక్కొక్కసారి ఆ దెబ్బ వల్ల రక్తం కారుతుంది. కానీ కుక్క ఆ రక్తము ఎముక నుండి స్రవిస్తుందని అనుకుని మరింత కొరుకుతుంది. ఇలాగే విషయానుభవ సమయంలో అంతఃకరణము యొక్క వృత్తి స్థిరమవడం వలన దానిలో ఆత్మ స్వరూపమైన ఆనందం యొక్క ప్రతిబింబము పడుతుంది. అప్పుడు ఆనందానుభవము కలుగుతుంది. దీనిని అజ్ఞాని భ్రాంతివలన విషయానంద మనుకుంటాడు. ఇలా ఆనంద ప్రతీతి (ఆనంద భ్రాంతి) జరిగిన ప్రతి చోటా వృత్తి స్థిరపడడం వలన వృత్తిలో ఆత్మ స్వరూపము యొక్క ప్రతిబింబము పడినందువలన ఆనంద ప్రతీతి కలుగుతుంది.

విషయములలో ఆనందమే వున్నట్లయితే ఒకదాని తరువాత మరొక విషయం పట్ల కోరిక కలుగకూడదు. స్థిరమైన వృత్తి యందు ప్రతిబింబరూపమైన ఆనందాన్ని అంగీకరించినట్లయితే, ఒక విషయాన్ని అనుభవించిన తరువాత మరొక విషయం పట్ల ఇష్టము కలగడానికి కారణము వృత్తి స్థిరత్వాన్ని కోల్పోవడమే అని తేటతెల్లమవుతుంది. ఈ చాంచల్యము కల వృత్తి ఆత్మస్వరూపం యొక్క ప్రతిబింబాన్ని గ్రహించే సామర్థ్యాన్ని కలిగి వుండకపోవడం వలన ఆనందము కలగదు.

అంతేకాదు విషయాలలో ఆనందము వున్నట్లయితే నిద్రలో (సుషుప్తిలో) ఏ విషయము లేకపోవడం వలన ఆనందము కలుగకూడదు. కానీ సుషుప్తిలో (నిద్రలో) కలిగే ఆనందము అందరికీ అనుభవమే గనుక విషయాల యందు కలిగే ఆనందము విషయాల చేత లభించినది కాదని, స్థిరవృత్తి యందు లభించిన ఆత్మస్వరూప ఆనంద ప్రతిబింబము మాత్రమేనని, అది భ్రాంతి వలన అలా అనిపిస్తున్నదనే విషయం స్పష్టం. ఈ ఆనందము ఆత్మసుఖమనే గంగా ప్రవాహము ఎదుట ఒక చిన్న బిందువు లాగా కూడా లెక్క కాదు.

## బ్రహ్మ సుఖము ముందు మిగిలిన సుఖాలన్నీ వ్యర్థాలు

నిరుపాధిక (ఉపాధి అవసరం లేని) బ్రహ్మసుఖమే నిజమైన సుఖము. వేదాలలో ఇలా చెప్పబడి వున్నది –

***శ్లో॥ యో వై భూమా తత్సుఖం***
***నాల్పే సుఖమస్తి భూమైవ సుఖం ।***
***భూమాత్వేవ విజిజ్ఞాసి తవ్య ఇతి ॥***
***(ఛాన్దోగ్యోపనిషత్)***

భావం : మహత్స్వరూపమైన బ్రహ్మమే సుఖము. తుచ్ఛములైన విషయపదార్థాలలో సుఖము లేదు. మహత్తరమైన బ్రహ్మసుఖమే సుఖము. కాబట్టి ఆ బ్రహ్మతత్వాన్ని తెలుసుకోవడానికే ప్రయత్నించాలి. ఆ బ్రహ్మ సుఖాన్ని గురించి తైత్తరీయ సంహితలో చెప్పబడింది.

మానవుడు రూపవంతుడు, యువకుడు, శాస్త్రజ్ఞుడు, పట్టుదల కలవాడు, బలవంతుడై ధనముతో కూడిన ఈ భూమి అంతా తన అధీనంలో వుంటే అతనికి ఆనందము కలుగుతుంది. ఇటువంటి వందమంది మానవుల ఆనందము ఒక మానవ గంధర్వుని ఆనందానికి సరిపోతుంది

ఈ మానవ గంధర్వానందము శ్రోత్రియుడు, నిష్కామి అయిన మానవునికి కలుగుతుంది. అటువంటి వందమంది మానవ గంధర్వులకు కలిగే ఆనందము ఒక దేవగంధర్వునికి కలుగుతుంది. అటువంటి వందమంది దేవగంధర్వులకు కలిగే ఆనందము చాలా కాలం స్థిరంగా పితృలోకంలో వుండే ఒక పితృదేవతకు కలుగుతుంది. అటువంటి ఆనందము శ్రోత్రియుడు, నిష్కామి అయిన మానవునికి కలుగుతుంది. అటువంటి వందమంది పితృదేవతలకు కలిగే ఆనందము జనన మరణాలు మొ॥నవి లేని దేవతలలో ఒకనికి కలిగే ఆనందానికి సమానము. అటువంటి వందమందికి కలిగే ఆనందము కర్మానుష్ఠానము చేత కలిగిన ఒక దివ్యానందానికి సమానము. ఈ కర్మానందానికి వందరెట్లు ముఖ్యమైన దివ్యానందము. అది శ్రోత్రియుడు, నిష్కామి అయిన మానవుడికి కలుగుతుంది. ఆ దివ్యానందానికి వందరెట్లు ఒక ఇంద్రానందము. అది నిష్కామి, శ్రోత్రియుడు అయిన మానవుడికి కలుగుతుంది. దానికి వందరెట్లు బృహస్పతికి కలిగే ఆనందము. అది శ్రోత్రియుడు, నిష్కామి అయిన మానవుడికి కలుగుతుంది. బృహస్పతికి కలిగే ఆనందానికి వందరెట్లు ప్రజాపతికి కలిగే ఒక ఆనందము. అది శ్రోత్రియుడు, నిష్కామి అయిన మానవునికి కలుగుతుంది.. ప్రజాపతికి కలిగే ఆనందానికి నూరు రెట్లు బ్రహ్మానందము. అదే పరమానందము యొక్క అంటే బ్రహ్మసుఖము యొక్క అంశము.

బ్రహ్మానందానికి సాటియైనది మరేముంటుంది? అది నిరతి సౌఖ్యము. కఠోపనిషత్తులో ఇలా వున్నది:-

*శ్లో॥ ఏకో వశీ సర్వభూతాంతరాత్మా,*
*ఏకం రూపం బహుధా యః కరోతి ।*
*తమాత్మస్థం యే సుపశ్యంతి ధీరాః*
*తేషాం సుఖం శాశ్వతం నేత రేషామ్ ॥*

భావం : సర్వభూత నియామకుడు, సర్వాంతర్గతుడు, తాను ఒకే రూపాన్ని కలిగి వున్నవాడైనా అనేక రూపాలలో కనిపించేవాడు అయిన ఆ పరమాత్మను ఏ ధీరుడు ఆత్మ యందు దర్శిస్తాడో అతడే సౌఖ్యాన్ని పొందుతాడు. ఇతరులు పొందరు.

ఇలాగే బ్రహ్మ సుఖాన్ని అనుభవించే జ్ఞాని ఇతర సుఖాలను ఆశించడు. విషం కలిసిన రుచికరమైన విందు భోజనము భోజనంచేసే సమయంలో ఎంత రుచికరంగా తోచినా క్రమంగా దుఃఖాన్ని కలిగిస్తుంది కదా! అలాగే ఐహిక సుఖాలు భగవద్గీత 18వ అధ్యాయంలో చెప్పినట్లు విషయ ఇంద్రియ సంయోగం వలన పుట్టడం చేత కొంతకాలానికి దుఃఖాన్నే కలిగిస్తాయి.

*శ్లో॥ యే హి సంస్పర్శజా భోగా*
*దుఃఖయోనయ ఏవ తే ।*
*ఆద్యన్త వన్తః కౌన్తేయ*
*న తేషు రమతే బుధః ॥*


భావం : విషయానుభవము ఇంద్రియ సంయోగం వలన కలుగుతుంది. అది దుఃఖ కారణము. విషయ ఇంద్రియ వియోగం చేత భోగాలకు నాశము కలుగుతుంది కదా! అవి క్షణికాలు కాబట్టి విద్వాసుడు వాటిలో సంతోషాన్ని పొందలేడు.

***పరిణామ తాపసంస్కార దుఃఖైర్గుణవృత్తి విరోధాచ్చ దుఃఖమేవ సర్వం వివేకినః***

***(యోగ సూత్రాలు)***

భావం : విషయాలలో పరిణామ దుఃఖము, పాప దుఃఖము, సంస్కార దుఃఖము అనే మూడు దుఃఖాలు వున్నాయి. అంతేకాదు, సత్యము మొ॥న గుణాలకు, వృత్తులకు పరస్పర విరోధము వున్నది. కాబట్టి విషయపదార్థ స్వరూపము చేతనే దుఃఖము కలుగుతుంది. కాబట్టి వివేకం వున్నవాడికి సమస్తము - అంటే ఈ లోకము, పరలోకము - రెండింటిలోనూ విషయపదార్థాలు దుఃఖదాయకాలే.

**- సశేషం**



# రేగేసాహెబ్

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఈనాటి సాయి భక్తులలో యువతరానికి కొత్త కొత్త ఆలోచనలు, అభిప్రాయాలు పుట్టుకొస్తున్నాయి. వేషభాషలలో, కాలగతిలో మార్పు లొచ్చినట్లే ఆధ్యాత్మికతలో గూడ మార్పు వస్తుందని వీరు తలుస్తారు. సంప్రదాయ పద్ధతిన సంధ్యావందనము, గాయత్రీ మంత్రజపము మొ॥న వాటి వలన యెట్టి ఉపయోగము లేదేమోనని కొందరి అభిప్రాయము. అటువంటి సాధనా పద్ధతులు వైజ్ఞానికమైన మనోవికాసం లేని వెనుకటి కాలానికి మాత్రమే తగినవేమోననీ, నేటి మనకు నిరుపయోగమనీ అనుకుంటారు. అటువంటి వారికి సాయి భక్తులలో ఒకడైన యం.బి.రేగే అనుభవం గర్వింపు కలిగిస్తుంది.

ఇండోర్ హైకోర్టులో జడ్జిగా పనిచేసి రిటైరయిన యం.బి.రేగే బాబా ప్రీతికి పాత్రుడైన భక్తుడు. ఇతడు చిన్నప్పటినుండి తీవ్రమైన ఆధ్యాత్మిక చింతన గలవాడు. బాల్యంనుండి యితడు గోవాలోని శాంత దుర్గాదేవిని యిష్టదైవంగా పూజించుకుని ధ్యానించుకునేవాడు. ఇతడు 8వ సం॥లో ఉపనయనమైనప్పటి నుండి సంధ్యావందనము, గాయత్రి జపము నిష్ఠగా చేస్తుండేవాడు.

ఆ రోజులలో ప్రఖ్యాత చిత్రకారుడైన రవివర్మ గీచిన ధృవ - నారాయణ చిత్రంలో ధృవుని తొలగించి ధ్యానంలో ఆ పాత్ర తానే వహించసాగాడు. సిద్ధాసనంలో కూర్చుని 15 ని॥లకు పైగా ఆ విష్ణుమూర్తిని ధ్యానంలో నిలుపుకోగలిగేవాడు. గురువు నాశ్రయించకుండానే ప్రాణాయామం సాధించి కొద్దిసేపు హృదయ స్పందన గూడ ఆపుకోగలిగేవాడు. సం॥1910లో అనగా తన 21వ సం॥లో ఒకేరాత్రి అతనికి మూడు స్వప్న దర్శనాలయ్యాయి. రెండవదానిలో శ్రీమన్నారాయణుడు అతనికి సాయిని చూపి, ఆయననే ఆశ్రయించమని చెప్పాడు, మూడవదానిలో అతడు శిరిడీ దర్శించాడు. అటు తర్వాత కొంతకాలానికతడు శిరిడీ దర్శించాడు. ఆ వివరం అతడిలా చెప్పాడు :

''నేను మొదట బాబాను మశీదులో దర్శించడానికి వెళ్ళినపుడు ఆయన చెంతన యితరులెందరో వున్నారు. నేను వెళ్ళి సాష్టాంగపడి వారి పాదాలపై నాతల వుంచాను. ఆయన, 'ఏమిటి, మానవుణ్ణి పూజిస్తావా?' అన్నారు. వెంటనే నేను కొంచెం వెనక్కు వెళ్ళి దూరంగా కూర్చున్నాను. ఆ ఎత్తిపొడుపు మాట నా హృదయానికి ఎంతో తీవ్రంగా తగిలింది. నిజమే! నేను కొన్ని గ్రంథాలు చదివి నేర్చిన భావాలవలన మానవులను పూజించడం తగదని తలచేవాణ్ణి. కనుక నేను వారిని దర్శించినందుకు సాయిబాబా నాకు దెబ్బకొట్టారని తలచాను. ఇప్పుడు నేను ఆ రెండు భావాల మధ్యా పడ్డాను. మానవాకృతిని పూజించకూడదన్న నా భావం బలైపోయింది. కాని మరొకవంక నాకు కలిగిన దర్శనాల దృష్ట్యా నేనాశించినట్లు ఆయన నన్ను శిష్యుడిగా అంగీకరించలేదు. నేను ఖిన్నుడనై అలాగే కొన్ని గంటలు కూర్చుండిపోయాను. అటు తర్వాత మశీదు నేలపై కూర్చున్న బాబానొక్కరినే విడిచి అందరూ వెళ్ళిపోయారు. అపుడు బాబా నన్ను గూడ వెళ్ళి రాధాకృష్ణ ఆయీ యింట బస చేయమని చెప్పారు. నేను అలానే చేసాను.

అది మధ్యాహ్న సమయం. ఆ సమయంలో బాబావద్దకెవరూ వెళ్ళగూడదని, అలా వారి ఏకాంతానికి అంతరాయం కలిగిస్తే శిక్షగా కీడు జరుగుతుందని అందరూ అనుకునేవారు. కాని అప్పటి నా మానసిక స్థితిలో యెట్టి

ప్రమాదం గురించిన ఆలోచనా నన్నాపలేకపోయింది. నేను శిరిడీ వెళ్ళేటప్పుడు పెట్టుకున్న ఒక్క ఆశా తునాతునకలైంది. ఇక భయపడేందుకేమున్నది? వారు నన్ను కొట్టి నా తల పగులగొట్టవచ్చు – కొడితే కొట్టనీ – అనుకుంటూ ఆయనను సమీపించాను. నేనింకా కొన్నిగజాల దూరంలో వుండగానే ఆయన ఆదరంగా తమ దగ్గరకు రమ్మని సైగ చేసారు. నేను ధైర్యం తెచ్చుకుని వెళ్ళి ఆయన పాదాలపై తలవంచాను. ఆయన వెంటనే నన్ను కౌగలించుకుని తమకు దగ్గరగా కూర్చోమని చెప్పి, "నీవు నా బిడ్డవు. ఇతరులున్నపుడు మేము బిడ్డలను దూరంగా వుంచుతాము" అన్నారు. ఉదయం ఆయన నన్ను యెందుకు నిరాకరించినట్లు కన్పించారో అర్థమయ్యాక నాపట్ల వారికున్న గాఢమైన ప్రేమను తెలుసుకున్న నా హృదయం కరిగిపోయింది. చివరకు వారే నా రక్షకుడు, గురువు, దిక్కూ అని గుర్తించాను".

రాధాకృష్ణ ఆయీ రేగేను కన్నబిడ్డ వలె చూచుకునేది. అతడు శిరిడీలో వున్నంతకాలము ఆయీకి నిత్యము బాబా రెండు రొట్టెలు పంపేవారు. ఆమె సాంగత్యం వలన యితడుగూడ శిరిడీలో తనకాలమంతటినీ సాయిసేవలోను, నామజపంలోనూ గడిపేవాడు. ఆమెవలెనే అతడుగూడా భగవంతుడు ప్రసాదించిన తన మధురమైన కంఠాన్ని భగవంతుని కీర్తనలు పాడుకొనడానికే వినియోగించుకునేవాడు. అతడు తన స్మృతులనింకా యిలా చెప్పాడు :

"నేనొకసారి శిరిడీ వెళ్ళి ఎప్పటి లాగే రాధాకృష్ణ ఆయీ యింట వున్నాను. మధ్యాహ్న సమయంలో మశీదులో తామొక్కరే వున్నపుడు బాబా నన్ను తీసుకురమ్మని మనిషిని పంపారు. తర్వాత ఆ వ్యక్తిని అక్కడినుండి పంపివేసి నన్నెంతగానో ఆదరించారు. నన్ను దగ్గరగా కూర్చోబెట్టుకుని, కౌగలించుకుని, 'నా ధనాగారం తాళంచెవి నీ చేతిలో వుంచుతున్నాను. నెలకు ₹.5/-లుగాని, ₹.100/-లుగాని లేక యింకేదైనాగాని – నీకు యేదికావాలంటే అది అడుగు, యిచ్చేస్తాను' అన్నారు. వెంటనే అది నాకు ఒక పరీక్ష అని తోచి నేనేమీ అడగదలచలేదు. నాకేది అవసరమో, మంచిదో బాబాకే తెలుసు. అది ఆయనే నిర్ణయించి యివ్వడమో యివ్వకపోవడమో చెయ్యాలి. నేనడగవలసిన పనిలేదు. నేనేమీ అడగడానికి యిష్టపడటం లేదని గమనించి, వారు నా గడ్డం పట్టుకుని ఏదో ఒకటి అడగమని బ్రతిమాలారు. 'అయితే నేనేదడిగితే అది యిస్తారా?' అన్నాను. 'ఆ, యిస్తాను' అన్నారు. 'అయితే బాబా, యీ జన్మలోనూ, ముందు ముందు రానున్న జన్మలన్నింటిలోనూ మీరు నన్ను విడువగూడదు. మీరు నా చెంతనే వుండాలి. ఇదే నాకు కావలసినది' అన్నాను. ఆయనెంతో సంతోషంగా నావీపు తట్టి, 'సరే తప్పకుండా. నేనెప్పుడూ నీచెంతనే, నీలోనూ, నీకు వెలుపలా వుంటాను – నీవెలావున్నా, యేం చేస్తున్నాసరే!' అన్నారు. నేను చెప్పలేనంత సంతోషించాను. (అప్పటినుంచి) ఆయనెప్పుడూ నా చెంతనున్నట్లు అనిపిస్తూ వుంటుంది. నా విశ్వాసం ధృవపరచడానికి ఒక్కొక్కప్పుడు వారు రూపంతో గూడా దర్శనమిస్తుంటారు."

ఒకనాడు రేగే మశీదులో వుండగా ఎవరో భక్తుడు ఎర్రని అరటిపండ్లు తెచ్చి బాబాకు సమర్పించాడు. అవంటే రేగే కెంతో యిష్టం. వాటిలో కొన్ని బాబా తనకు యిస్తారని అతడాశించాడు. వెంటనే బాబా అతనికేసి చూచి ఒక పండు తీసుకుని ఒలిచి పండంతా ఇతర భక్తులకు పంచి, పైతొక్కు మాత్రం రేగేకిచ్చి తినమన్నారు. అతడెలాగో అది తినేశాడు. తర్వాత బాబా రెండవ పండు, మూడవ పండు గూడ తీసుకుని అలాగే చేశారు. చివరకు నాల్గవపండు చేతిలోకి తీసుకుని అతనికేసి చూసి, "నేను నీకేమీ యివ్వలేదా?" అని ఆ పండు వలచి, కొంచెం తాము కొరుక్కుని అదెంతో బాగుందన్నారు. తర్వాత భాగం అతని నోటికందించి, కొరుక్కోమన్నారు. మళ్ళీ తానొక్క ముక్క కొరుక్కుని, అతనికొకముక్క కొరికిస్తూ అలా పండంతా పూర్తిచేసారు. ఈ లీల గురించి ఆలోచిస్తే, ఎంతో విలువైన ఆధ్యాత్మ సూత్రాలు తెలుస్తాయి. మొదట ఆ పండ్లను చూడగానే రేగేకు జిహ్వాచాపల్యం కలిగింది. పండురూపం చూడడంవలన, తానిదివరకు ఆ పండు తినిన అనుభవం గుర్తురావడం వలన కలిగిన జిహ్వాచాపల్యం వలన బాబా ప్రసాదమన్న భావమే అతనికి స్ఫురించకుండాపోయింది. అది ఒక బలహీనత అన్న గుర్తింపు గూడ అతనికి కలుగలేదు. నామరూపాలవల్ల కలిగిన లౌకిక సుఖభ్రాంతి విడుస్తేగాని – బాబా పరిభాషలో చెప్పాలంటే 'ఐదు' సమర్పిస్తేగాని – గురుకృప లభించదు. బాగా ఆలోచించి, నామరూపాత్మకమైన ఇంద్రియవిషయాలు నిజంగా సుఖమయములుగావని మొదట ముముక్షువు తెలుసుకోవాలి. అప్పుడుగాని విషయాలపట్ల వైరాగ్యం కలుగదు. కాని అందుకు తగిన జీవితానుభవం సద్గురుకృప వల్లనే కల్గుతుంది. అందుకే

సాయి అతనిని భ్రమింపజేసిన అరటితొక్కను మాత్రమే అతనికిచ్చారు - ఒకసారిగాదు, ముమ్మారు. నిజమైన ఆత్మసుఖం ఇంద్రియ విషయాలమాటున దాగివుంటుంది. సద్గురువు దానినే అనుభవిస్తుంటారు. అటువంటి గురువు, విశ్వాసము, ఓరిమిలతో తమను శరణు పొంది, మొదట తాము ప్రసాదించిన కఠిన పరీక్షలను విశ్వాసంతో హృదయపూర్వకంగా స్వీకరించిన సచ్ఛిష్యునికి మాత్రమే ప్రసాదిస్తారు. దానిని అరటిపండు ఒలిచినట్లు అత్యంత సులభంగా బహిర్గతంచేసి నోటికి అందిస్తారు. ఆ స్థితిలో గురు- శిష్యులకు అభేదం సిద్ధిస్తుంది. దానిని తెల్పడానికే ఆ గురుశిష్యులిద్దరూ చెరొకముక్కా కొరుక్కుంటూ ఆరగిస్తారు - ధర్మశాస్త్ర ప్రకారం యుక్తవయస్కుడైన కొడుకుతో తండ్రిగూడ మిత్రునివలె వ్యవహరించినట్లు; ప్రియురాలిపట్ల ప్రియుడు అభేదంతో ప్రవర్తించినట్లు. కాని మోక్షంకోసం గాకుండా కేవలం లౌకిక సుఖాలకోసము, లౌకికమైన కష్టాలు తొలగించుకోడానికి మాత్రమే సద్గురువును, భగవంతుణ్ణి ఆశ్రయించేవారికి ఆ దైవం సులభంగా వారు కోరినది ప్రసాదిస్తారు. దానిని తెల్పడానికే సాయిగూడ యితర భక్తులందరికీ వెంటనే అరటిపండ్లు పంచారు. ఈ సత్యాన్ని ఒక ముస్లిం మహాత్ముడు (సూఫీ) ఎంతో చమత్కారంగా యిలా చెప్పాడు; "బిచ్చగానికీ, చుట్టం చూపుగా వచ్చిపోయేవారికీ వారు కోరినది వెంటనే యిచ్చి పంపివేస్తాము. ఆప్తులైనమిత్రులకుమాత్రంసాధ్యమయినంత జాప్యంచేస్తూ వారిని వీలయినంత ఎక్కువసేపు మన చెంత నుంచుకోజూస్తాము. అంతకంటెగూడ, మనను ప్రేమ విశ్వాసాలతో ఆశ్రయించుకొన్న బిడ్డలకు చిరకాలం విద్య, క్రమశిక్షణ యిచ్చి చివరికెప్పుడో మన ఆస్తిపాస్తులు యావత్తూ వారికిచ్చివేస్తాము". అలానే భగవంతుడు మరియు సద్గురువు గూడ కేవలం లౌకికమైన భక్తులను సాధ్యమయినంత త్వరగా వదిలించుకోవడానికి వారు కోరిన లౌకిక సుఖాలు వెంటనే ప్రసాదిస్తారు; కేవలం జ్ఞానం కోరిన ఆత్మీయుల నుండి లౌకికమైన సంపదలన్నీ తీసివేసుకొని, తమపై ఆధారపడి, తమ సేవలోనే జీవించేలా చేసి, చివరికెప్పుడో వాళ్ళను సంపూర్ణంగా అనుగ్రహిస్తారు. లోకంలో చూచేవారందరికీ అట్టి సద్భక్తుణ్ణి సద్గురువు కటాక్షింపకపోగా ఎన్నో కష్టాలు పెట్టినట్లుగూడా తోస్తుంది. ఆ సమయంలో ఆ భక్తుడు గూడ అలానే తలచవచ్చు. కాని అసలు విషయం సద్గురువుకు తెలుసు. ఓరిమితో తనను నమ్మి సేవించినవారికి ఉత్తమోత్తమమైన శాశ్వత శ్రేయస్సు చేకూరుస్తామన్న వాగ్దానమెన్నటికీ వమ్ముచేయరు. ఈ విషయంపై సద్భక్తునికి పూర్ణమైన విశ్వాసం వుండాలి. అట్టివాడే సద్భక్తుడు. తాత్కాలికంగా అతనికిగూడ సద్గురువు ఇతరులను అనుగ్రహించినంత మాత్రంగూడ తనను అనుగ్రహించడం లేదని ఆ సమయంలో తోస్తుందని తెల్పడానికే బాబా, ''నేను నీకేమీ ఇవ్వలేదా?" అని ప్రశ్నించారు. మిగిలిన భక్తులందరికీ లభించినవి మేలయిన అరటిపండ్లు మాత్రమే - వాటిని ప్రసాదించినది సద్గురువే గావచ్చుగాక! కాని భక్తివిశ్వాసాలతో, అచంచలమైన ప్రేమతో ఆయనేమి ప్రసాదించినా సంతోషంగా తీసుకున్న రేగేకు మాత్రం సాయి ప్రసాదం లభించింది. అంతేకాదు, ఆ సద్గురువు 'ఉచ్ఛిష్టం' (ఆయన తినగా మిగిలినది) లభించినది! బాబా తాముగా తమ ఉచ్ఛిష్టం భక్తునికి ప్రసాదించిన సందర్భము ఇంకొకటి లేదు. ఆ ప్రసాదం ఎంత పవిత్రమైనది? ఆ సద్భక్తుడు కొరికి తినిన తర్వాత గూడ ఆయన తిరిగి ప్రీతితో తినదగినది. తల్లి ఎంగిలి బిడ్డకు మధురం. బిడ్డ ఎంగిలి తల్లికి ప్రీతి, తన రక్త మాంసాల రూపమే తన బిడ్డ అన్న భావమే ఆ ప్రీతికర్థం. అట్టి ప్రేమే సాయి నుండి రేగే పొందాడు. అందుకే తరువాత ఒక గురుపూర్ణిమనాడు భక్తులందరూ బాబాకు పూలమాలలు వేస్తుంటే, తానేమీ తేనందుకు రేగే నొచ్చుకుంటుంటే, బాబా ఆ మాలలన్నీ చూపుతూ, "ఇవన్నీ నీవే" అన్నారు. అంటే అందరూ వేసిన మాలలు కలిసి అతని హృదయంలో ఆయన పట్ల గల మాయని ప్రేమ అనే మాలకు సరితూగుతాయని వారి భావం. సాయి తమ గురువుకు బాహ్యమైన పూలమాలలు ఎన్నిమార్లు వేసారు గనుక! సం॥1916లో రేగే ఎవరూ చూడకుండా వారి ఆసనం క్రిందకు నెట్టి విడిచిన మస్లిన్ గుడ్డను బయటకు తీయించి, "ఇది నాది, ఇది తిరిగివ్వను" అంటూ బాబా దానిని తమ భుజాల పై కప్పుకుంటూ రేగేకేసి చూసి, "ఇది నేను కప్పుకుంటే బాగుందికదూ!" అన్నారు. రేగేవంటి భక్తుని ప్రేమ అతని హృదయంలో నిష్ఠ అచంచలమైన భక్తి, ఓరిమిల రూపంలో గుప్తంగా వుంటుంది (సాయి కూర్చున్న ఆసనం క్రింద మస్లిన్ గుడ్డ వున్నట్లు). భర్తపట్ల గల ప్రేమను పతివ్రత ఎన్నడూ లోకానికి ప్రకటించుకోదు. అలా ప్రకటించేది వేశ్య మాత్రమే. అంతటి ప్రియుడు తనపట్ల సంప్రీతుడయ్యాడని లోకానికి గర్వంగా చాటుకుంటుంది. వేశ్యకు లోకం యొక్క

మెప్పు ముఖ్యం, కాని ప్రియునిపై తనకున్న ప్రేమగాదు. కాని గుప్తమైన పతివ్రత యొక్క ప్రేమయే నిజమైన ఆభరణం.

ఇట్టి ప్రేమకు ఫలితమేమిటి?

అతని నిష్ఠ సబూరీలకు ఫలితం ఆయన తమ సర్వస్వమూ అతని ముందుంచడమే. బాబా నుండి ప్రేమపూర్వకమైన ఆలింగనం పొందే మహాభాగ్యం గూడ యితనికొక్కడికే దక్కిందని చెప్పవచ్చు. అట్టి పరిస్థితే మనకు కల్గితే మనం బాబాను ఏమి కోరేవాళ్ళమో ఆలోచించుకున్నాక యిటు పై చదవండి. అతడేమీ కోరలేదు. తనకేది శ్రేయస్కరమో తనకంటే ఆయనకే బాగా తెలుసునని అతడి విశ్వాసం. కాని బాబా అతడికేమైనా ప్రసాదించాలని తమకు ఆత్రుతగా వున్నదని చెప్పి, ఏదైనా కోరుకోమని చెప్పి అతని గడ్డం పట్టుకుని బ్రతిమాలారు. నిష్కల్మషమైన ప్రేమే సరైన మార్గం చూపుతుంది. అతడు, "ఈ జన్మలో కాని లేక యింకా జన్మలుంటే వాటన్నింటిలోనూ మీరు నానుండి దూరమవగూడదు. మీరెల్లప్పుడూ నాతోనే వుండాలి" అన్నాడు. నేనైతే, "నన్ను మీ అంతటి గురువును చేయండి" అని కోరేవాణ్ణే. "అందుకు ఇంకెంతో నిష్ఠ, సబూరి వుండాలి" అని బాబా చెప్పడంతో అంతటి అవకాశం చేజారిపోయేదే. కాని రేగే కోరేదానికి సాయి ఎంతగానో సంతోషించి, భుజంతట్టి, "సరే, నీవెక్కడున్నా నీలోను, నీ చుట్టూను ఎప్పుడూ నేనే వుంటాను" అన్నారు. అదే ఆయన అతడికి ప్రసాదించిన శాశ్వతమైన ఆలింగనం. బాబా సమాధి చెందాక గూడ అతటికట్టి అనుభవం స్థిరంగా నిలిచిపోవడమే విశేషం. సాయికి వారి గురువిచ్చిన ఆశీర్వచనంగూడ యిదే, అది గుర్తుంచుకోనడమే.

సాయి తమను అంతగా ఆశ్రయించుకున్న రేగే హృదయాన్ని సర్వబంధాల నుండి రక్షించుకుంటూ వచ్చారు. సం॥ 1914లో రేగే దంపతులు ఆయన దర్శనానికి శిరిడీ వెళ్ళారు. బాబా అతనిని చూడగానే, "నా ప్రసాదమొకటి మీ వద్దకొచ్చింది" అన్నారు. ఆయన చెప్పినది తనకు కల్గనున్న బిడ్డ గురించేనని రేగేకు అర్థమయింది; అపుడు అతని భార్య గర్భవతి. తర్వాత కొంత కాలానికి అతని భార్య ప్రసవించాక, బిడ్డను బాబా దర్శనానికి తీసుకు వెళ్ళారు. సాయి ఆ బిడ్డను ముద్దాడి రేగేను, "యీ బిడ్డ నీవాడా లేక నావాడా?" అని అడిగారు. "మీ వాడే" అన్నాడు రేగే. 'అయితే నావాడుగా వీడిని మీకు అప్పగిస్తున్నాను, అలానే చూచుకో' అన్నారు బాబా. వారి భావమేమో ఎవరికీ అర్థం కాలేదు. ఒకటిన్నర సం॥ల తర్వాత ఆ బిడ్డకు న్యుమోనియో వచ్చింది. అతనికి చికిత్స చేసిన వైద్యులు, ప్రమాదం తప్పి రోగి కోల్కొంటున్నాడని తలుస్తూన్న సమయంలో అకస్మాత్తుగా బిడ్డకు ప్రమాదించసాగింది. రేగే వెంటనే అతణ్ణి పూజ గదిలోకి తీసుకువెళ్ళి, బాబా పటం ముందు కూర్చొని, "బాబా, యీబిడ్డ మీవాడు. కనుక బిడ్డను తీసుకుని మీలో అతడికి ఆత్మశాంతిని ప్రసాదించండి. స్థూలంగా యితడు జన్మించడానికి నిమిత్తమాత్రుడనైనందుకు అతడి కర్మను నేను తీసుకుంటాను" అని ప్రార్థించాడు. తర్వాత రేగే ఆ బిడ్డ తలపై తన చేయి పెట్టగానే, ఆ బిడ్డ ఎంతో ఆనందంగా చిరునవ్వొలికించాడు. తక్షణమే అతని మాడు బుసగొట్టిన శబ్దంతో లోపలికి పీల్చుకుపోయినట్లయి అతడు ప్రాణం విడిచాడు. అంటే అతడు మహాయోగివలె తన బ్రహ్మరంధ్రంగుండా ప్రాణం విడిచాడన్న మాట. భార్య, బిడ్డలు, ధనములపై మోహాన్ని జయించడమంటే యిదే. కొద్ది నెలల తర్వాత రేగే శిరిడీ వెళ్ళినపుడు బాబా అతనిని చూపి, ఒక భక్తునితో, "ఇతడెవరు? ఎక్కడుంటాడు?" అన్నారు. ఆ భక్తుడు, "ఇతడు రేగే, ఇండోర్ లో వుంటాడు" అన్నాడు. బాబా, "కాదు, నువు చెప్పింది సరిగాదు. అతడెప్పుడూ యిక్కడే వుంటాడు. నేనెప్పుడూ యితని చెంతనే వుంటాను" అని మళ్ళీ, "ఇతనికి బిడ్డలెవరైనా వున్నారా?" అన్నారు. అచటి భక్తులు, "లేరు బాబా, అతనికున్న ఒక్క బిడ్డా యిటీవలే చనిపోయాడు" అన్నారు. వెంటనే బాబా, "చనిపోవడమా! కాదు కాదు. ఏం జరిగిందో నేను చెబుతాను. ఆ బిడ్డ నావాడు. ఇతడు నా బిడ్డను పెంచడం మాత్రమే జరిగింది. ''ఒకరోజితడు, 'ఈ బిడ్డను శాశ్వతంగా మీవద్దనే వుంచుకోండి, అతని కర్మ నేననుభవిస్తాను' అన్నాడు. కనుక నేనా బిడ్డను తీసుకుని యిక్కడ వుంచుకొన్నాను" అంటూ తమ హృదయం కేసి చూపించి, "అతడిక్కడే శాశ్వతంగా వుంటాడు" అన్నారు. అంటే ఆ బిడ్డకు మోక్షమనుగ్రహించారన్న మాట. ఈలోగా రేగేకు మమకారం చుట్టుకోకుండా జరుగనున్న దానిని తగురీతిన నిగూఢంగా హెచ్చరించారు బాబా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

శ్రీ భోలానాథ్ గారు అమ్మతో, "ఏమిటి ఇదంతా? నువ్వు అసలు ఏమి చేస్తున్నావో ఆలోచించావా? రాత్రింబగళ్లు భక్తులతోనే గడపడం ఎంతవరకు సమంజసం?" అన్నారు.

అమ్మ నవ్వుతూ శ్రీ బోలానాథ్ గారితో, "చూడండి నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. మీరు ఒకసారి గతాన్ని స్మరణకు తెచ్చుకోండి. మొదట్లో నేను యెలా వుండేదాన్నో గుర్తుందా? నేను మీ ఇంట్లో ఒక మూల పడి వుండేదాన్ని. మీ అనుమతి లేకుండా యెక్కడికీ వెళ్ళేదాన్ని కాదు. ఆ పరిస్థితులలో మీరే కదా నన్ను అందరి యెదుటకు వెళ్ళమనీ, వారి మాట్లాడమనీ బలవంత పెట్టారు? భక్తుల కోరిక మేరకు వారితో ధర్మసంబంధమైన సందేహాలు తీర్చమనీ, ఆధ్యాత్మిక చర్చలు జరపవలసిందనీ ఆదేశించారు? భక్తులకు కర్తవ్యబోధ చేయమని ఆజ్ఞాపించారు. మీ కోరిక ప్రకారమే మీరు చెప్పినట్లు చేస్తున్నాను. ఇందులో నాకై నేను చేసింది ఏమున్నది?" అన్నారు.

"నువ్వు చెప్పింది నిజమే! కానీ యింతగా కుటుంబం, యిల్లు పట్టించుకోకుండా రోజంతా భక్తులతో గడిపితే యిక మా పరిస్థితి ఏమిటి?" అన్నారు శ్రీ భోలానాథ్ గారు.

"మీ ఆజ్ఞ ప్రకారం నేను అందరి మధ్యకు వచ్చాను. ఇక యిప్పుడు అందరి దాననైనాను. పరిస్థితి యింతవరకు వచ్చిన తరువాత మీరు మళ్ళీ యిలా మాట్లాడటం వలన ప్రయోజనం యేముంటుంది" అని బదులిచ్చారు అమ్మ.

మరల చిన్నగా నవ్వి, "మీ చేతిలోని కుండలో నీరు వున్నది. మీరే దానిని నేలపై పారబోసుకున్నారు. ఇప్పుడు మళ్ళీ ఆ నీళ్లను ప్రోగుచేసుకొని కుండలో పోసుకుందామనుకుంటే వీలవుతుందా? అలా చేయ ప్రయత్నించినా మట్టితో కలుషితమైన నీరు మాత్రమే దొరుకుతుంది" అన్నారు.

అవును మరి! శ్రీ ఆనందమయి మాత చెప్పినట్లు యిప్పుడు ఆమె అందరివారైనారు. స్త్రీ రూపంలో దిగివచ్చిన ఆ దివ్యశక్తి భక్తజనులకు



తన మాతృప్రేమను పంచారు. అమ్మలోని ఈ మాతృప్రేమ గురించి గతంలో జరిగిన సంఘటన ఒకటి ప్రస్తావించుకొందాము.

అమ్మ వివాహమైన కొత్త రోజులలో శ్రీ భోలానాథ్ గారు మొదట పోలీసు డిపార్ట్మెంటులో ఉద్యోగం చేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఆ ఉద్యోగం మానివేసి ఢాకా నవాబుగారి ఆధ్వర్యంలో ఉన్న ప్రాంతంలో అష్టగాం అనే ఊరిలో సర్వే డిపార్ట్మెంటులో ఉద్యోగిగా నియమింపబడ్డారు. అష్ట గ్రామంలో అమ్మ పొరుగింట్లో

వున్న జయశంకర్ సేన్ అనే అతని బావమరిది హరకుమార్ రాయ్ అనే యువకుడుండేవాడు. అతనికి అప్పుడప్పుడు మతిస్థిమితం తప్పుతుండేది. అందువలన అతడు కొన్నాళ్లు వుద్యోగం మానివేసి తన అక్కగారింట్లో వున్నాడు. ఆ సమయంలో అతడు పొరుగింట్లో వున్న శ్రీ ఆనందమయి మాతను చూడగానే ఆమెలో అతనికి చనిపోయిన తన తల్లి కనిపించడంతో ఆమెను 'అమ్మా' అని పిలవసాగాడు. ప్రతిరోజు వుదయం, సాయంత్రం అమ్మ యింటికి వచ్చేవాడు.

ఇంటి పనులలో, బజారు పనులలో సహాయపడతానని, పనులు చెప్పమని అమ్మను ప్రాధేయపడేవాడు. అప్పుడు అమ్మ వయసు 18సంలు. ఇరుగుపొరుగు వారికి అతడు ఆ విధంగా ప్రతిరోజు అమ్మ యింటికి రావడం నచ్చేది కాదు. అమ్మ కూడా అతని యెదుటకు వచ్చే వారే కాదు. అతనితో మాట్లాడేవారు కాదు. "అమ్మా నీ బిడ్డ ముందు నీకు సిగ్గు ఏమిటమ్మా? నాతో మాట్లాడండి" అంటూ యెంత వేడుకున్నా అమ్మ అతనితో ఒక్క మాట కూడా మాట్లాడేవారు కాదు. అమ్మ భోజన సమయంలో వచ్చి తనకు ఒక ముద్ద ప్రసాదం పెట్టమని బ్రతిమాలేవాడు. శ్రీ బోలానాథ్ గారితో కూడా అమ్మ చేతి ప్రసాదం తినాలని వున్నదని తనతో మాట్లాడవలసిందిగా, తనకు ప్రసాదం పెట్టమని చెప్పవలసిందిగా అమ్మకి చెప్పమని అడిగేవాడు. ఒకసారి శ్రీ బోలానాథ్ గారి ఆజ్ఞ మేరకు అమ్మ ఒకే ఒక ముద్ద అతనికి ప్రసాదం యిచ్చారు. కానీ అతనితో అమ్మ మాట్లాడనే లేదు. "అమ్మా కనీసం రాయిని వేడుకున్నా పలుకుతుందేమో కానీ, నీ మనసు మాత్రం కరగటం లేదు. నువ్వు నాతో మాట్లాడవు. నేనేం చేయను? నువ్వు మామూలు స్త్రీవి కాదు. చాలా గొప్ప దానివి. ఈనాడు నేను ఒక్కడినే నిన్ను 'అమ్మా!' అని పిలుస్తున్నాను. కానీ రాబోయే రోజులలో ఎందరో నిన్ను అమ్మా అని పిలుస్తారు" అనేవాడు హరకుమార్. ఆ తర్వాత కొన్నాళ్లకు హరకుమార్ ఉద్యోగం నిమిత్తం మరొక వూరు వెళ్లిపోయాడు. ఆనాడు హరకుమార్ చెప్పిన భవిష్యవాణి నిజమైంది. కానీ హరకుమార్ మాత్రం తిరిగి ఎన్నడూ అమ్మ జీవితంలో తటస్థపడటం జరగలేదు.

ఆ తర్వాత 1917వ సంIIలో శ్రీ భోలానాథ్ గారికి అష్టగ్రామం నుండి బాజిత్పూర్ కు బదిలీ అయింది. బాజిత్ పూర్ లో అమ్మ పొరుగింటి జానకీబాబు భార్య ఉషను అమ్మ 'ఉషా దీదీ' అని పిలిచేవారు. ఉషకు అమ్మపై యెంతో అభిమానం యేర్పడడంతో ప్రతిరోజు అమ్మ వద్దకు వచ్చి కొంచెంసేపు అమ్మతో మాట్లాడి వెళుతుండేది. ఆ రోజుల్లోనే అమ్మ యెక్కువగా సమాధి స్థితిలో బాహ్యస్మృతి కోల్పోతుండేవారు. ఒక్కొక్కసారి అమ్మ ప్రమేయం లేకుండానే శరీరంలో రకరకాల యోగాసనాలు, యోగముద్రలు వస్తుండేవి. ఇరుగుపొరుగువారు యిదంతా గమనించి, అమ్మకు యే దయ్యమో భూతమో ఆవహించిందనుకునేవారు. ఉష అత్తగారు కూడా అలాగే భావించి ఉషను అమ్మ వద్దకు వెళ్లవద్దని వారించేది. అయితే అవన్నీ దేవీముద్రలని, యోగక్రియలని ఉష నమ్మకం. అత్తగారి కళ్ళుగప్పి యెలాగో ఉష అమ్మ వద్దకు వచ్చేది. క్రమంగా ఉషకు అమ్మపై భక్తి భావం పెరిగింది. ఒకసారి ఆమె కుమారునికి జ్వరం వచ్చింది. ఉష ఆ బిడ్డను అమ్మ వద్దకు తీసుకువచ్చి "అమ్మా! నీ చేతి స్పర్శతో నా బిడ్డ జ్వరం తగ్గుతుందని నాకు అనిపిస్తున్నది. ఒకసారి వీడిని తాకి ఆశీర్వదించమ్మా" అని ప్రార్థించింది. అమ్మ ఆ పిల్లవాడిని యెత్తుకొని తలపై చేయిపెట్టి ఆశీర్వదించగానే జ్వరం తగ్గిపోయింది. పిల్లవాడు ఆరోగ్యవంతుడవడంతో ఉష ఆనందానికి అవధులు లేవు. ఉష తరచు ఆనందమయి మాతతో యిలా అనేది: "అమ్మా, నాకు నువ్వు స్నేహితురాలుగా అనిపించటం లేదు. నీపై నాకు మాతృభావం కలుగుతున్నది. నేను నిన్ను 'అమ్మా' అని పిలుస్తాను". ఆ మాటకు అమ్మ అలౌకికంగా నవ్వుతూ, "నువ్వు ఒక్కదానివే కాదు, చాలామంది ఈ శరీరాన్ని 'అమ్మా' అని పిలుస్తారు" అన్నారు. అమ్మ శ్రీ భోలానాథ్ గారితో 'నేను అందరి దాననైనాను' అన్నమాట సత్యమై నిలిచింది. కాలాంతరంలో అమ్మ అందరికీ మాతృమూర్తియై అందరివారైనారు.

ఇక కాశీలో అమ్మ ఒక ప్రభంజనమే సృష్టించారు. కుంజమోహనగారి ఇంటి పరిసరాలన్నీ ఒక తిరునాళ్ల ఉత్సవాలను తలపించాయి. కుంజమోహన్ గారి ఇంటి మూడు అంతస్తుల భవనం భక్తులతో ప్రతిరోజు రాత్రింబగళ్లు నిండిపోయేది. అలా కొంతకాలం గడిచిన తర్వాత అమ్మ తిరుగు ప్రయాణం నిశ్చయమైంది. ఆ విషయం విన్న కుంజమోహన్ గారి భార్య 'అమ్మను వంట ఇంట్లో నా ఎదురుగా కూర్చోబెట్టుకొని

పసిపిల్లకు తినిపించినట్లుగా భోజనం తినిపించాలని అనుకున్నాను. ఈ జన సందోహంతో నాకు ఆ అవకాశం రాలేదు' అని బాధపడింది. గురుప్రియ ద్వారా ఈ విషయం తెలుసుకున్న అమ్మ, "నేను ఆమె కోరిక తప్పక తీరుస్తాను" అంటూ ఒకరోజు తనకై తానే నేరుగా వంట ఇంట్లోకి వెళ్లి కుంజమోహన్ గారి భార్యతో, "వచ్చాను. త్వరగా తినిపించవా" అన్నారు. ఆమె ఆనందానికి అవధులు లేవు. ఆమె అమ్మకు తృప్తిగా భోజనం తినిపించి, "అమ్మా, ఇదంతా మా పూర్వీకుల పుణ్యం. వారేమి తపస్సు చేసుకున్నారో గాని మా కుటుంబానికి మీ దివ్యసాన్నిధ్యంలో గడిపే అవకాశం లభించింది" అన్నది. అమ్మ "అవును 14 తరాల ముందు కుంజమోహన్ గారు, శ్రీ భోలానాథ్ గారు సహోదరులవుతారు" అన్నారు. అమ్మ మాటలకు వారు యెంతో ఆనందించారు. అమ్మ శ్రీ భోలానాథ్ గారి గురించి, "వీరు యేడు తరాల తర్వాత సిద్ధపురుషులవుతారు" అన్నారు. ఆ మరుసటి రోజు అమ్మ కలకత్తా పయనమైనారు

కలకత్తాలో అమ్మ చారుఘోష్ అనే భక్తుని ఇంటిలో విడిది చేశారు. ఢాకా నుండి అమ్మ దర్శనార్థం రాయ్ బహద్దూర్ గారు, ఆయన భార్య కలకత్తా వచ్చారు. రాయి బహద్దూర్ గారు నాస్తికుడు కాకపోయినా ఆయనలో దైవచింతన యేమాత్రం వుండేది కాదు. కానీ ఆనందమయి అమ్మ దర్శనంతో ఆయన వైఖరిలో పూర్తిగా మార్పు వచ్చింది ఒకరోజు ఆయన అమ్మ అనుమతితో అమ్మకు పండ్లు, మిఠాయిలు స్వహస్తాలతో తినిపించడం జరిగింది. ఆ రోజు అమ్మ అతనితో "ఇకనుండి నువ్వు యే పదార్థాన్ని తిన్నా ముందుగా దైవానికి నివేదించి, ఆ తర్వాత తిను" అన్నారు. అంతేకాదు ఆయనను అమ్మ నిరంతర దైవసంకీర్తనలో కాలం గడపవలసిందిగా ఆదేశించారు. ఈ విధంగా అమ్మ ఆదేశంతో ఆయన తన జీవిత చివరి రోజులలో పూర్తి దైవచింతనలో గడిపే భాగ్యాన్ని పొందారు. అమ్మ ఆదేశాలను తు.చ. తప్పక పాటించి ఆధ్యాత్మిక వున్నతిని పొందారు.

M.B.B.S. పాసై కొత్తగా వైద్యవృత్తిలో ప్రవేశించిన కాళిదాసు అనే యువకుడు ప్రతిరోజు అమ్మను దర్శించేవాడు. ఎప్పటి వలెనే ఒకరోజు కాళిదాసు తన మిత్రులతో కలసి అమ్మ దర్శనార్థం వచ్చాడు.

అమ్మ అతనిని "బండిమీద వచ్చావా?" అని అడిగారు.

"లేదమ్మా! నడిచే వచ్చానమ్మా!" అన్నాడు కాళిదాసు.

"మీ ఇల్లు చాలా దూరం కదా. బండిమీద రాకపోయావా" అన్నారు అమ్మ.

కాళిదాసు "అమ్మా, నా ఉద్దేశం యేమిటంటే భగవంతుడు ప్రతి ఒక్కరికి కాళ్లు యిచ్చింది నడవడానికి కదా. నడవగలిగిన ఆరోగ్యవంతులు వాహనం వుపయోగించకుండా వుండటమే ధర్మమని నాకు అనిపిస్తుంది. నడువలేని వృద్ధులు, రోగులు, వికలాంగులు వాహనం వుపయోగించవచ్చు. కానీ నా వంటి యువకులకు, ఆరోగ్యవంతులకు వాహనం యెందుకు? వారు నడువగలరు కదా! అలా నడవగలిగి వుండి కూడా గుఱ్ఱపు బండిపై రావటం వలన మన భారాన్ని అన్యాయంగా గుఱ్ఱంపై వేసి, మనం సుఖంగా కూర్చుని దానిని బాధ పెట్టడం పాపం కదా, అమ్మా. అందుకే నేనెప్పుడూ వాహనం వుపయోగించను. ఎంత దూరమైనా నడిచే వెళ్తాను" అన్నాడు.

శ్రీ ఆనందమయి అమ్మ అతని మాటలకు నవ్వుతూ "ఇందులో పాపం ఏముంది? ప్రతి జీవి జన్మనెత్తటం అనేది కర్మక్షయం చేసుకొనటానికే. అది మనిషైనా, జంతువైనా సరే. సమస్త జీవులు వారి వారి ప్రారబ్ధానుసారం జన్మలు పొందటం జరుగుతుంది. వారి వారి కర్మలను అనుసరించి వారి జీవనం సాగుతుంది. జన్మాంతంలో కర్మక్షయం జరిగి ఆ జీవి ఆ శరీరాన్ని విడిచిపెట్టడం జరుగుతుంది. నువ్వు నీ పూర్వకర్మ ననుసరించి మానవజన్మను పొందావు. వైద్యవృత్తితో రోగులకు సేవ చేస్తూ నీ కర్మక్షయం చేసుకుంటున్నావు. కానీ ఆ గుఱ్ఱం వైద్యవిద్య నేర్చుకుని ప్రజాసేవ చేయలేదు కదా! అది బండి లాగి సుఖంగా ప్రయాణం చేయటానికి మనుషులకు సహాయపడుతూ ఆ విధంగా కర్మక్షయం చేసుకుంటుంది. అలాగే మనిషికి జంతువులకు లేని మానసిక జ్ఞానసంపద, తెలివితేటలు భగవంతుడు ప్రసాదించాడు. ఆ జ్ఞానంతోనే నువ్వు వైద్యవిద్య నేర్చుకోగలిగావు. ఆ విధంగా రోగపీడితులైన వారిని నువ్వు రక్షిస్తూ కర్మక్షయం చేసుకోగలవు. కాలినడకతో వైద్యశాలలకు గాని మరెక్కడికైనా గాని నువ్వు ప్రయాణించడానికి వెచ్చించే సమయాన్ని, శ్రమను నీకు చేతనైన వైద్యవిద్యతో ప్రజాసేవ చేసి కర్మ క్షాళనం చేసుకొనడం మంచిది కదా! గుఱ్ఱాన్ని బాధ పెట్టడం అని నువ్వు

చెబుతున్నావు. కానీ నీవు నడవడానికి పట్టే శ్రమ, సమయం వెచ్చించి రోగులను బాధా విముక్తుల్ని చేయటం ఎంత అవసరమో ఆలోచించు. అంతేకాదు గుఱ్ఱం బండిపై ప్రయాణం చేయటం వలన దాని కర్మక్షయానికి నువ్వు తోడ్పడినవాడవే అవుతావు గాని మరొకటి కాదు. ఎవరు చేయవలసిన పనిని వారు చేయటం మంచిది" అన్నారు.

శ్రీశ్రీ ఆనందమయి మాత కొన్నాళ్ళ తర్వాత కలకత్తా నుండి ఢాకా తిరిగివచ్చారు. కొన్నాళ్లకు కాళీమాత విగ్రహాన్ని సిద్ధేశ్వరిలో నిర్మింపబడిన గదిలో ఒక చెక్కతో అలమర చేయించి, దానిలో ప్రతిష్టించారు. పూజాదికములన్నీ అక్కడే యథావిధిగా నిర్వహింపసాగారు. సమీపంలోని రావిచెట్టు క్రింద యజ్ఞాగ్ని స్థాపించి హోమాదికములు జరుపసాగారు. కులదా దాదా నిత్యమూ హవనము, శివపూజ, దుర్గా సప్తశతి పఠన చేసేవాడు. కులదా దాదా అమ్మకు గొప్ప భక్తుడు. తన భారములన్నీ అమ్మపై వేసి అమ్మనే తన సర్వస్వంగా భావించి నిరంతర అమ్మ స్మరణలోనే కాలం గడిపేవాడు.

అమ్మ కాశీ నుండి ఢాకా కు తిరిగి వచ్చిన తరువాత కొన్నాళ్లకు మరల సిద్ధేశ్వరి ఆశ్రమానికి వచ్చారు అక్కడ అమ్మ 6 – 7 నెలలు వున్నారు. సిద్ధేశ్వరిలో అమ్మ బోలానాథ్ గారితో అక్కడ వున్న చిన్న గదిలో ఏకాంతంలో సాధన కొనసాగించవలసిందిగా ఆదేశించారు. అలా ఆయన ఆ గదిలో సాధన కొనసాగిస్తున్న సమయంలో ఒకరోజు ధ్యానంలో శిరస్సులేని కాళీమాత ఆయనకు దర్శనం యిచ్చారు. ఆ విషయాన్ని విన్న అమ్మ తారాపీఠ్ అనే క్షేత్రానికి వెళ్లి అక్కడ కొంతకాలం సాధన చేయవలసిందిగా చెప్పటంతో అమ్మ ఆదేశంతో ఆయన తారాపీఠ్ వెళ్లారు. ఆ క్షేత్రంలో తారాదేవి అని పిలవబడే కాళీమాత విగ్రహం వుంటుంది. ఆ దేవి శిరస్సును ప్రతి రాత్రి విగ్రహం నుండి వేరుచేసి వేరొక చోట భద్రపరుస్తారు రాత్రంతా శిరస్సులేని విగ్రహమే గుడిలో వుంటుంది. మరునాటి ఉదయం గుడిలోని విగ్రహానికి స్నానసేవలు పాలాభిషేకాలు జరిపిన అనంతరం తిరిగి శిరస్సును అలంకరించి పూజలు చేస్తారు. ఈ విషయంలో ఆశ్చర్యమేమంటే ఇంతకుముందు ఎన్నడూ అమ్మ తారాపీఠ్ కు వెళ్ళటం జరగలేదు. ఆ ఆలయం గురించిన వివరాలు విని వుండలేదు. శ్రీ భోలానాథ్ గారు, యోగేష్ దాదా అనే భక్తుని వెంటబెట్టుకొని తారాపీఠ్ కు వెళ్లి అక్కడ తీవ్ర సాధనలో నిమగ్నమైనారు.

పది రోజులు గడిచాయి 11వ రోజున సురేంద్రనాథ్ ముఖోపాధ్యాయ అనే భక్తుడు శ్రీ భోలానాథ్ గారి వద్ద నుండి ఒక ఉత్తరం తీసుకొని అమ్మ వద్దకు వచ్చాడు. ఆ ఉత్తరం అందిన వెంటనే బయలుదేరి రమ్మని అమ్మకు బోలానాథ్ గారు రాశారు. అమ్మ గురుప్రియ మొదలైన భక్తులను వెంటబెట్టుకొని వెంటనే తారాపీఠ్ చేరుకున్నారు. శ్రీ ఆనందమయి మాత వెళ్ళిన కొన్ని రోజులకు మరికొందరు భక్తులు కూడా తారాపీఠ్ వెళ్లారు.

తారాపీఠ్ క్షేత్రం అడవి ప్రాంతంలో ఉండే ఒక నిర్మానుష్య ప్రదేశం. కొద్దిమంది పండాల ఇండ్లు మాత్రమే ఉండే అతి చిన్న గ్రామం. తారామాత ఆలయం ప్రక్కనే శివాలయం కూడా వుంటుంది. సంధ్యా సమయం తర్వాత ఆ ప్రాంతంలో జనసంచారం వుండదు. సాయంత్రం నాలుగు గంటలకే పూజారులు తలుపులు మూసివేసి గ్రామంలోకి వెళ్లిపోతారు. శ్రీ ఆనందమయి మాత శ్రీ భోలానాథ్ గారు రాత్రి సమయాలలో ఆలయంలో తారామాత సన్నిధిలో నిద్రించేవారు. భక్తులంతా గ్రామంలోనే వుండసాగారు.

అమ్మ తారాపీఠ్ కు రావడంతో ఆ ప్రాంతపు రూపురేఖలే మారిపోయాయి. అమ్మ వచ్చారన్న విషయం క్రమంగా పరిసర గ్రామాల ప్రజలకు తెలియడంతో తారాపీఠ్ క్షేత్రం జనసందోహంతో నిండిపోయింది. నిత్యమూ మందిరంలో పూజలు, భజనలతో ఆ ప్రదేశం మారుమ్రోగింది. ప్రతిరోజూ సంతర్పణలు కూడా జరిగాయి.

తారాపీఠ్ లో తారామాత సన్నిధిలో శ్రీ భోలానాథ్ గారికి ఎంతో ఉత్తమ ఆధ్యాత్మిక స్థితి ప్రాప్తించింది. అది పుష్యమాసం కావడంతో ఆ ప్రాంతమంతా విపరీతమైన చలిగాలులు వేయసాగాయి. అంతకు మించిన దోమల బెడద. అయినప్పటికీ యివేవీ భోలానాథ్ గారి సాధనను ఆటంక పరచలేదు. మరొక విశేషం ఏమిటంటే ఆయనకు ఎంతోకాలంగా వున్న హుక్కా పీల్చే అలవాటు కూడా పూర్తిగా తొలగిపోయింది. రాత్రింబగళ్లు ఆయన తారామాత మందిరములోనూ, శివ మందిరంలోను గడపసాగారు. ఆనందమయి మాత పగలంతా బయట తిరుగుతూ రాత్రి తారామాత మందిరంలో నిద్రించేవారు.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# ధుని ప్రదాత

**డాక్టర్. నర్సింహం (కావలి)**

*("మీరు ధుని ఏర్పాటుచేసుకుంటే, ధునే మందిరాన్ని ఏర్పాటు చేసుకుంటుంది" అన్న మాస్టరుగారి వాక్యాలు విని షిర్డీ నుంచి మాకు ధుని లభించవలెనన్న దృఢ నిశ్చయంతో షిర్డీ యాత్రకు బయలుదేరినాము. ఎంతమంది నిరుత్సాహపరచినా మాస్టరుగారి సంకల్ప బలంతో అనూహ్యంగా బాబా ధునిని ప్రసాదించడం ఒక అద్భుత లీల. ఆ లీలలో మేము పాత్రధారులం కావటం మా అదృష్టం - అంటూ వారి యాత్రా విశేషాలతోపాటు వారికి, మాస్టరుగారితో వున్న అనుబంధాన్ని ఈ విధంగా మనకి అందిస్తున్నారు.)*

ఆయన మనకు ఎంతో శిక్షణ యిస్తారు. మనం చేసే పనంతా బాబా సేవగా భావించి చేయమనేవారు. ధ్యానం అంటే 'పెద్దవాళ్ళింటికొస్తే మన ధ్యాసంతా వారి మీదే వుంటుంది. అదే ధ్యానం అంటే' అని ధ్యానం గురించి చెప్పి, దాని గురించి ఎవరితోను డిస్కస్ చెయ్యద్దన్నారు. స్నానం చేస్తుంటే దత్తస్వామికి స్నానం చేయిస్తున్నట్టు ఆ నీటిలోనే మనం స్నానం చేస్తున్నట్టు భావించమనేవారు. ఇలానే ఏదైనా ఆయనకి చేస్తున్నట్టు చేస్తే ఆయన సన్నిధి లభిస్తుందనేవారు. పిల్లల విద్యావిధానంలో మార్పు తీసుకొని రావాలనేవారు. "పిల్లలు చాలా సుకుమారంగా వుంటారు గనుక వారికి అలసట కల్గించేవి, నరాల మీద ఒత్తిడి కల్పించే పనులు వారిచేత చేయించరాదనేవారు. చేతులకు శ్రమ కల్గించకుండా నోటితో చెప్పించాలి. వారి జ్ఞాపక శక్తి పెంచాలి. కూడికలు, తీసివేతలు మొదలైనవి ఎక్కాల్లాగా ఒప్పచెప్పించాలి. అక్షరాభ్యాసం ఎ.బి. సి.డిలతోనే మొదలు పెట్టనక్కర్లేదు. మానసిక ఒత్తిళ్ళకు గురిచేయరాదు. కొంత వయస్సు వచ్చాకే లెక్కలు చేయించాలి" అని అనేవారు.

ఫిజియాలజీ బుక్స్ కొన్ని చదువుతూ, "ఇందులో జీవిత సారాంశం వున్నది. దానిని జాగ్రత్తగా చదివితే జీవిత రహస్యం తెలిసిపోతుంది" అనేవారు. ప్రాపగేషన్ ఆఫ్ లైఫ్ (రీప్రొడక్షన్), సస్టినాన్స్ ఆఫ్ లైఫ్ ని గురించి ఆయన వే ఆఫ్ అప్రోచ్ చాలా డైరెక్టుగా వుండి సెంట్రల్ పాయింట్ కి వెళ్తారు, ఒకసారి డిఫెన్స్ డిపార్ట్మెంట్ నుంచి ఒక సైంటిస్ట్ వచ్చారు. ఆయనను మాస్టరుగారికి పరిచయం చేశాను. ఆయన మాస్టరుగారిని బుక్స్ చాలా త్వరగా చదివే పద్ధతి చెప్పమన్నారు. అందుకు ఆయనొక ప్రక్రియ చెప్పి మాస్టరుగారు 'ఇంత శ్రమ పడే బదులు ఒక సద్గురువు కాళ్ళు పట్టుకుంటే నీవు సాధించదలచుకొన్నది నీకు ఆయన యిచ్చేస్తారు" అని చెప్పారు. ఆయన ఎప్పుడూ తన గురించి తను చెప్పుకోలేదు. కాని ఎప్పుడో ఒకసారి యిలా చెప్పారు, "నా గుప్పెట్లో ఎన్నో విషయాలున్నాయి. కాని పర్మిషన్ లేదు". ఆయన యిలా చెప్పడం చాలా అరుదు. రాధాకృష్ణ గారని ఒకాయన వుండేవారు. ఆయన పెథెడిన్ కి అలవాటు పడ్డారు. ఒకసారి ఆయన మాస్టరుగారి ప్రసంగం విన్నారు. కళ్ళనుండి కన్నీళ్ళు కారుతున్నాయి. పెథెడిన్ తీసుకునే టైం అయింది. కాని ఆ అవసరం లేకపోయింది. తర్వాత దాన్నుంచి బయట పడ్డారు.

శ్రీ మాస్టరుగారికి 50సం॥లు నిండిన సందర్భంగా రజతోత్సవ పత్రిక వేయించదలచాము. ఆయన ఒప్పుకోరనే సందేహంతో 'సీతమ్మ తల్లి' నీవన్నా చెప్పవమ్మా అన్నట్లు అమ్మగారి సహాయము కోరాము. ఆయన అంగీకరించి మొదటి ఆర్టికల్ బాబా గురించినదై వుండాలని నిర్దేశించారు. ఆయన ఆజ్ఞానుసారం "మానవ జాతి అనే మహావృక్షానికి

పండిన ఆధ్యాత్మిక ఫలం షిర్డీ సాయిబాబా" అన్న ఆర్టికల్ నాకెంతో నచ్చింది. దాన్ని మొట్టమొదటిదిగా ఎన్నుకున్నాము. ఇప్పుడు తలచుకుంటే ఎంతో ఆశ్చర్యంగా ఎంతో అర్థంలేనిదిగా అన్పిస్తుంది. జన్మదినాన ఆవిష్కరించవలసిన సావనీరు ఏమిటి బాబా సమాధి వ్యాసంతో మొదలు కావడ మేమిటి? ఇప్పుడు ఎంతో అమంగళంగాను విడ్డూరంగానూ అన్పిస్తుంది. కాని ఎందుకో అప్పుడు ఎవరికీ ఏమీ అన్పించలేదు.

మాస్టరుగారి దగ్గర ఒక ప్రశ్నాపత్రం వుండేది. అందులోనిది ఒకటి రాముడు గొప్పా? ప్రహ్లాదుడు గొప్పా? శ్రీకృష్ణుడు గొప్పా? ఎందరు మహనీయులని అడిగినా ఎవరూ ఆయనకు తృప్తికరంగా సమాధానమీయలేదు. చివరకు బాబా దర్శనంతో ఆయన ప్రశ్నలకు సమాధానాలు లభించాయి. నా భార్య రమకు మాస్టరుగారి గురించి వ్రాయాలని వుండేది. సావనీర్ చేయటం ద్వారా మాస్టరుగారు ఆమె కోరిక తీర్చారు. మాస్టరుగారు ఎప్పుడూ సిగరెట్ త్రాగుతూన్నా తమాషాగా అస్సలు ఆయన దగ్గర ఆ వాసనే వచ్చేది కాదు.

ఒకసారి మాస్టరుగారు ఆచారాలు, పట్టింపులు వీటి గురించి చెప్తూ "ఆచారాలు ముఖ్యం కాదు" అని చాలా ఖచ్చితంగా, నిష్కర్షగా చెప్పారు. ఒకసారి స్నానము, శుచి గురించి చెప్తూ, "సాయిబాబా చరిత్ర పారాయణకి, బద్ధకం వల్లనైతే తప్పుగాని, మరీ వీలుపడకపోతే స్నానం చేయకపోయినా పారాయణ



చేయవచ్చు. అంతేకాని స్నానం చేయని కారణాన పారాయణ మానుకోవాల్సిన పనిలేదు. మనం చేసేది ఆయన పనే అయినపుడు స్నానం చేసినా, చేయక పోయినా ఫరవాలేదు" అని అన్నారు. మాస్టరుగారు రేపు సమాధి చెందుతారనగా నేను మా అత్తగారిని తీసుకుని ఏలూరు వెళ్తూ ఒంగోలులో దిగాము. అక్కల్కోట స్వామివారి పాదుకలు వచ్చినాయని తెలిసి మందిరానికి వెళ్ళాము. మాస్టరుగారు ఆ రోజు మందిరంలో వుపన్యసించాలి. కాని ఎంతకీ రాకపోతే వారి ఇంటి కెళ్లాము. కొంచెం అస్వస్థతగా వున్నారు. హోమియో డాక్టరుగారు వచ్చి వున్నారు. ఇ.సి.జి. తీయించమని ఒకతనికి చెప్పి మాస్టరుగారికి నమస్కరించి వచ్చేశాను. అదే నాకు లభించిన అంతిమ దర్శనం.

ఆయన సశరీరంగా లేకపోయినప్పటికీ ఆయన దీవెనలు యిప్పటికీ మాకు అందుతూనే వున్నాయి. మాస్టరుగారి విగ్రహాన్ని చేయించి మా యింట్లో పెట్టుకుని పూజించుకుంటున్నాం. ఒకసారి హారతి పాడేటప్పుడు మాస్టరుగారి విగ్రహంలో కదలికలు కన్పించాయి. మా స్టాఫ్ అందరికీ ఆయనంటే భక్తి, శ్రద్ధలున్నాయి. బయటవారు, పరిచయస్థులు హాస్పిటల్ కు వచ్చి మాతో మాట్లాడినా ఒకసారి పైకి వెళ్ళి మాస్టరుగారిని చూసొస్తాం అని చూసి వెళ్తుంటారు. మాకు ఇది ఒక గుడి. మాస్టరుగారు చూపిన పంథాలో జీవితాంతం నడవాలని ఆకాంక్షిస్తున్నాము. అందుకు కావాల్సిన శక్తి సామర్థ్యాలను వారినే అనుగ్రహించమని వేడుకుంటున్నాము. ●

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి అపర్ణ, హైదరాబాద్

మా నాన్నగారు గురు బంధువులందరికీ సుపరిచితులైన కావలి డాక్టర్ నరసింహం గారు, అమ్మ డాక్టర్ రమాదేవి గారు. 2003 ప్రాంతంలో నేను హైదరాబాదులో, ఖైరతాబాద్ లో ఉద్యోగం చేసేదాన్ని. శ్రీ సాయిలీలామృతము పారాయణ చేస్తున్నప్పుడు, ప్యారేకిషన్ వాలీ అనుభవం చదివేటప్పుడు నాకు ఒక సందేహం వచ్చేది. ఆ లీలలో,,,, అతను ప్రయాణం చేస్తున్న నౌక మునిగిపోయే సందర్భంలో బాబా కాపాడతారు. ఆ లీల చివరలో "నడి సముద్రంలో కూడా సాయికి తన భక్తుని కేక వినిపిస్తుంది" అని వుంటుంది. ఆ వాక్యం ఎప్పుడు చదివినా నాకు చాల ఆశ్చర్యంగా వుండేది. అతని కేక బాబాకి ఎలా వినిపించిందా అని!. ఎలా వినిపిస్తుందో బాబా నాకు అనుభవపూర్వకంగా తెలియచేసారు. ఒకసారి నాకు నడుము పట్టేసి బాగా నొప్పి వచ్చింది. నేను ప్రతి రోజూ రామకృష్ణ మఠంలో యోగా చేసి, తరవాత ఆఫీసుకి వెళ్లేదాన్ని. అలా యోగా చేసేటప్పుడు ఏదైనా పొరపాటు చేసానేమో అనిపించింది. నేను నల్లకుంటలో వుంటున్న మా నాన్నగారి స్నేహితుని ఇంట్లో వుండేదాన్ని. వారు కూడా డాక్టర్ గారే. వారి పేరు పి.ఎన్.రావు గారు. నా నడుము నొప్పి విషయం కొన్నాళ్ల తరవాత మా అంకుల్ కి చెప్తే నాకు ఒక మాత్ర యిచ్చారు. అది వేసుకుని నేను ఆఫీసుకి వెళ్ళిపోయాను. నాకు కొన్ని మాత్రలు పడవు. అప్పటికి ఆ విషయం నాకూ తెలియదు. ఆఫీసుకి వెళ్లేసరికి, నాకు ఒకలాగా అనిపిస్తోంది, దాదాపుగా స్పృహ కోల్పోయే పరిస్థితి. మాట సరిగ్గా రావటం లేదు. ఆఫీసులో నా స్నేహితులందరూ నాకేం జరిగిందో తెలియక కంగారు పడుతున్నారు. వాళ్లందరికీ అంకుల్ పేరు చెప్పాలని వుంది, కానీ చెప్పలేకపోతున్నాను, నోటి నుండి మాట బయటికి రావడంలేదు. నేను ఆలోచిస్తున్నాను, వీళ్ళకి ఎలా చెప్పగలనా అని. చాలా రకాలుగా ప్రయత్నిస్తున్నాను, కానీ శబ్దం బైటికి రావడం లేదు. నన్ను అంకుల్ దగ్గరకి చేరిస్తేనే కానీ నాకు సరైన వైద్యం జరగదు. అప్పుడు ప్యారేకిషన్ వాలీ అనుభవం గుర్తుకొచ్చింది. నేను మనస్ఫూర్తిగా బాబాని తలచుకుని ఏవో కొన్ని మాటలు బైటికి అన్నాను. కాస్సేపటికి నేను మా అంకుల్ దగ్గర వున్నాను. 'హమ్మయ్య' అనుకున్నాను. తరవాత తెలిసిన విషయమేమిటంటే, మా ఆఫీసు వాళ్లకి మా అంకుల్ పేరు మాత్రమే స్పష్టంగా వినపడిందిట, మిగిలినవి ఏవీ సరిగా అర్థం కాలేదట. అప్పుడు ప్యారేకిషన్ వాలీ అనుభవం 'ఆర్తితో బాబాని పిలిస్తే ఆయనకి తప్పకుండా వినిపిస్తుంది' అనేది అర్థం అయ్యింది. నా విషయంలో ఆర్తితో బాబాని స్మరించినందువల్ల ఆ డాక్టరుగారి పేరొకటి స్పష్టంగా బైటకి వచ్చి, జరగవలసిన క్రియ అంతా జరిగింది. బాబా దయవల్ల తొందరగానే కోలుకున్నాను.

2007 వ సంవత్సరంలో నాకు బాబు పుట్టిన సందర్భంగా కావలిలో మా పుట్టింట్లో వున్నాను. ఒకరోజు సాయంత్రం 5 గంటల సమయానికి సత్సంగ సభ్యులు ఒక బాబా చిత్రపటం తెచ్చి సోఫాలో పెట్టారు. అది బాబా సమాధి మందిరం చిత్రపటం. నేనది చూసి 'చాలా బాగున్నారు బాబా' కానీ, దీనికంటే 'ద్వారకామాయి చిత్రపటం బాగుంటుంది' అనుకున్నాను. అంతే, సుమారు రెండు గంటల తరవాత 7-30 ప్రాంతంలో ఇంకొక చిత్రపటం సత్సంగ సభ్యులెవరో తెచ్చారు, అది ద్వారకామాయి బాబా ఫోటో. అది

మిగతా 29వ పేజీలో

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీ విజయ కుమార్**

పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ లీలావైభవాన్ని ఒంగోలు వాస్తవ్యులు విజయకుమార్ గారు ఈ విధంగా తెలియచేస్తున్నారు..

నేను 4వ తరగతి చదివే రోజుల్లో సుబ్బలక్ష్మత్తయ్యగారింట్లో పూజ్యశ్రీ మాస్టరుగారిని మొట్టమొదటిసారి చూశాను. మా నాన్నగారు దాసగణు విరచిత 'స్తవనమంజరి' అనే చిన్న గ్రంథాన్ని తెలుగులోకి అనువదించిన శ్రీ గంజాం శేషగిరిరావుగారు. చిత్రం ఏమిటంటే మా నాన్నగారికంటే ముందే నాకు పూజ్యశ్రీ మాస్టరుగారితో పరిచయమైంది. నేను, సుబ్బలక్ష్మి అత్తయ్యగారి అబ్బాయిలు, ఇంకా కొంతమంది పిల్లలం పూజ్యశ్రీ మాస్టరుగారి సత్సంగాలలో అవసరమైనప్పుడు ఎప్పుడైనా చిన్న చిన్న సేవలు చేస్తూ వుండేవారము. పూజ్యశ్రీ మాస్టరుగారి సత్సంగం అర్థం కాకపోయినా, ఆయన పెట్టే ప్రసాదాల కోసం పిల్లలందరం వెళుతుండేవారము.

పూజ్యశ్రీ మాస్టరుగారికి జరగబోయే విషయాలు ముందుగానే తెలుస్తాయని మా పిల్లల బృందానికి కూడా ఒకసారి అనుభవమైంది. ఒకరోజున పూజ్యశ్రీ మాస్టరుగారు ఒకరింటికి వచ్చివున్నారు. మధ్యాహ్న సమయంలో హఠాత్తుగా మాతో, "ఒరేయ్, నాలుగు కుర్చీలు బయట వరండాలో వెయ్యండిరా!" అని చెప్పారు. కాసేపటికి పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి నలుగురు భక్తులు వచ్చారు! తరువాత తెలిసిన విషయం ఏమిటంటే.. ఆ వచ్చినవారు చెన్నై వెళుతూ ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారిని దర్శనం చేసుకుందామని అప్పటికప్పుడు బ్రేక్ జర్నీ చేసుకుని వచ్చారుట!! ఆ విషయం ముందే తెలిసిన పూజ్యశ్రీ మాస్టరుగారు మా చేత తగిన ఏర్పాట్లు చేయించారు! నేను పెద్దయ్యాక ఇలాంటివి వారికి సహజమేనని తెలిసింది.

'శిరిడీ హారతులు' గ్రంథాల ప్రచురణ సమయంలో ప్రెస్ లో కాపీలు తీసి, బ్రౌన్ కలర్ అట్ట వేసి చిన్న చిన్న పుస్తకాలుగా మమ్మల్ని కుట్టమనేవారు. మేము అలా కుట్టి వారికి ఇచ్చినప్పుడు మాకు పెన్సిల్స్, ఎరైజర్స్ బహుమతులుగా ఇచ్చేవారు. వారి సమక్షంలో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఆనందాన్ని అనుభవించేవారు.

ఒకసారి ఒంగోలులో బాబా మందిరం గురించిన చర్చలలో భాగంగా, "మన కమిటీకి ఒక లాయర్ కావాలి!" అని పూజ్యశ్రీ మాస్టరుగారు అనడం విని నేను, "మా నాన్నగారు లాయరేనండి, ఆయనను నేను తీసుకువస్తాను" అని చెప్పి మా నాన్నగారిని పూజ్యశ్రీ మాస్టరుగారి వద్దకు తీసుకువచ్చాను. గుంటూరు AC కాలేజీలో మా నాన్నగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు కలిసి చదువుకున్నారని తరువాత తెలిసింది. అప్పటినుంచి నాన్నగారు కూడా తరచుగా పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వస్తూండేవారు.

కొంతకాలానికి బాబా మందిరం నిర్మితమైంది. ఆ గుడి శంకుస్థాపనకు చందోలు రాఘవనారాయణశాస్త్రిగారు వచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ మందిరంలో వున్న ధునిలో శిరిడీ ధునిలోని అగ్నిని తీసుకువచ్చి కలిపారు. బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు కొలువైవున్న ఒంగోలులోని ఈ మందిరం నేడు మహాపుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. పూజ్యశ్రీ మాస్టరుగారు తరచుగా మందిరంలో సత్సంగాలు చేస్తుండేవారు.

ఒకసారి ఒకరి ఇంటికి సత్సంగానికి వస్తానని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు. వారి ఇల్లు చాలా చిన్నది. నిజానికి అదొక పూరిగుడిసె.

అక్కడ ఒకాయన, "సత్సంగం ఇంటి బయట పెడితే బాగుంటుంది. ఇంటి లోపలకు వెళ్ళేటప్పుడు మాస్టరుగారు వంగి లోపలకు వెళ్ళాలి కదా! అలా వెళ్ళేటప్పుడు చూరుకున్న బొంగులు ఆయనకు గుచ్చుకుంటాయేమో!" అన్నాడు. పూజ్యశ్రీ మాస్టరుగారికి ఇబ్బంది కలుగుతుందేమోనని అతని ఉద్దేశం. కానీ ఆ ఇంటి యజమానికి పూజ్యశ్రీ మాస్టరుగారి సత్సంగం తమ ఇంట్లోనే జరుపుకోవాలని కోరిక. ఆ ఇంటి చుట్టుపక్కల వున్నవారు కూడా ఇంటి అతనికే మద్దతునిస్తూ బయటనుంచి వచ్చేవారు కూర్చోడానికి కుర్చీలు మొదలైనవి ఏర్పాటు చేస్తున్నారు. ఈలోగా పూజ్యశ్రీ మాస్టరుగారు వచ్చారు. ఆ ఇంటివారు పూజ్యశ్రీ మాస్టరుగారి పాదాలు కడిగాక వారు పాకలోకి వెళ్ళబోతూ వుండగా, ఇంతసేపూ గొణుగుతున్నతను, "మాస్టరుగారూ జాగ్రత్తండి! తల బాగా వంచుకుని వెళ్ళండి. లేకపోతే బొంగులు గుచ్చుకుంటాయి" అన్నాడు. పూజ్యశ్రీ మాస్టరుగారు, "అలాగే! ఎంతటివాడైనా బాబా ముందు తలదించుకునే రావాలి!" అన్నారు. ఎంత గొప్ప సమాధానం? అలా చెప్పడం వారికే చెల్లింది. అలా ఆ ఇంటి యజమానికి తృప్తి కలిగించారాయన.

దాసగణు మరాఠీలో వ్రాసిన స్తవనమంజరిని శివనేశన్ స్వామిగారు ఇంగ్లీషులోకి అనువాదం చేశారు. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడీకి వెళ్ళినప్పుడు శివనేశన్ స్వామిగారు ఆ పుస్తకాన్ని పూజ్యశ్రీ మాస్టరుగారికిస్తూ దానిని తెలుగులోకి అనువాదం చేయించమన్నారు. ఎవరిచేత చేయిస్తే బాగుంటుందన్న ప్రస్తావన వచ్చినపుడు శివనేశన్ స్వామిగారు పూజ్యశ్రీ మాస్టరుగారితో, "నువ్వు తిరిగి వెళ్ళాక ఉదయమే మీ ఇంటికి ఎవరొస్తారో వారిని అనువదించమని చెప్పు!" అన్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడీనుంచి వచ్చిన మర్నాడు ఉదయమే మా నాన్నగారు, ఏదో పని వుండి పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్లారు! వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడీలో శివనేశన్ స్వామితో జరిగిన సంభాషణ అంతా వివరించి, ఆ చిన్ని గ్రంథాన్ని నాన్నగారికి ఇచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారి పర్యవేక్షణలో ఆ గ్రంథ అనువాదాన్ని మా నాన్నగారు 1982 వ సంవత్సరంలో వినాయకచవితి రోజున పూర్తిచేశారు. పూజ్యశ్రీ మాస్టరుగారి చేత ఆ గ్రంథం ఆవిష్కరింపబడింది.

1987వ సంవత్సరంలో మా నాన్నగారు చనిపోయారు. 10వ రోజు నేను పూజ్యశ్రీ మాస్టరుగారిని మా ఇంటికి భోజనానికి ఆహ్వానించాను. పూజ్యశ్రీ మాస్టరుగారు మా ఇంటికి వచ్చి, "ఎంత పెద్దవాళ్ళైపోయార్రా మీరు?!" అని మమ్మల్ని దగ్గరకు తీసుకుని మా అమ్మకి ధైర్యం చెప్పారు. అప్పటికి నా పదవ తరగతి పూర్తిచేశాను. ఆ తరువాత రెండు సంవత్సరముల లోపలే పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా మమ్మల్ని వదిలి వెళ్లిపోయారు. అంతటి ప్రేమమూర్తిని, కరుణామూర్తిని ఎప్పటికీ పొందలేము.

బాబా మందిరం ప్రారంభం నుంచి నాన్నగారు కమిటీ సభ్యుడిగా వున్నారు. నాన్నగారు వెళ్లిపోయిన తరవాత నేను ఆ సేవను కొనసాగిస్తున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరంలో ఆయన ఎదురుగా కూర్చుంటే మనసు ప్రశాంతమైపోతుంది. ఎంతటి సమస్యకైనా పరిష్కారం దొరుకుతుంది. ఆయన ఈనాటికీ నిత్యసత్యులై అందరినీ అనుగ్రహిస్తున్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అంతటి మహాత్ముని పాదపద్మములకు అంజలి ఘటించి నమస్కరిస్తున్నాను. ●

## ద్వారకామాయి అనుభవ మండపము

27వ పేజీ తరువాయి

చూసి 'అబ్బా, చాలా బాగున్నారు బాబా! కానీ, ద్వారాకామాయిలో గెడ్డానికి చెయ్యి ఆన్చుకుని కూర్చుని వుంటారు, వారికెదురుగా ధుని ఉంటుంది. అందులో బాబా ఇంకా బాగుంటారు' అనిపించింది. మర్నాడు ఉదయం 7 గంటల సమయంలో నేను ముందుగదిలోకి వచ్చేసరికి, నిన్న మనసులో ఎలాంటి బాబా చిత్రపటం బాగుంటుంది అనుకున్నానో అలాంటి చిత్రపటం సోఫాలో పెట్టి వుంది!! నేను ఒక్కసారిగా ఆశ్చర్యపోయాను! నిన్నటి నించి యథాలాపంగా బాబా ఇలా బాగుంటారు, అలా ఇంకా బాగుంటారు అనుకుంటున్నానే కానీ అవన్నీ వరుసగా నిజాలవుతున్నాయని ఈరోజు గుర్తింపుకి వచ్చి, కళ్ళవెంట నీరు ధార కట్టింది. నేను వారిని పదిలంగా నాతోపాటు మా ఇంటికి తెచ్చేసుకున్నాను. ఇలా ఎన్నో అనుభవాలని ప్రసాదించిన మనోహరునికి మనస్సుమాంజలి సమర్పిస్తున్నాను. ●

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS,** C/o. SRI MANGA BHARADWAJA TRUST

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68. Phone: +91 - 74160 41550

Branch Office : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 08592233271

Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", Payable at Hyderabad or Ongole.

# BOOKS CLASSIFICATION

## 1. BOOKS ON SHRI GURU DATTA

*శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు*

- శ్రీ గురు చరిత్ర + శ్రీ సాయి లీలామృతము (బౌండ్) 499-00
- శ్రీ గురు చరిత్ర 199-00
- శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి 149-00
- శ్రీ దత్తావతార మహత్యము 75-00

## 2. BOOKS ON SRI SAI BABA

*షిరిడి సాయిబాబా పై విరచితమైన శ్రీ షిరిడి గ్రంథములు*

- శ్రీ సాయి లీలామృతము 199-00
- శ్రీ సాయి సన్నిధి 199-00
- శ్రీ సాయి ప్రబోధామృతము 119-00
- శ్రీ సాయినాథ పూజ 49-00
- షిరిడి హారతులు 15-00
- శిరిడి క్షేత్ర సందర్శనము 49-00
- సాయినాథ స్తవన మంజరి 10-00
- సాయిని పూజించడం ఎందుకు? 10-00
- సాయి సూక్తి ఆచార్యవాణి 20-00
- శ్రీ సాయి నిత్య సత్య వ్రతము 20-00

## 3. BOOKS ON MAHATMAS

*ఇతర మహాత్ముల గ్రంథములు*

- శ్రీ అక్కల్ కోట స్వామి 75-00
- శ్రీ తాజుద్దీన్ బాబా 75-00
- శ్రీ అవధూత వెంకయ్య స్వామి 99-00
- అవధూత శ్రీ చీరాల స్వామి 75-00
- శ్రీ పాకలపాటి గురువుగారు 75-00
- శ్రీ ఆనందమయి అమ్మ 75-00
- శ్రీ గురు సిద్ధారూడ స్వామి 99-00
- శ్రీ అవధూత చివటం అమ్మ 99-00
- టిబేట్ యోగి మిలారేపా చరిత్ర 99-00

## 4. BOOKS ON ANVESHANA & SCIENCE & RELIGION

*అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు*

- ఏది నిజం 49-00
- మతం ఎందుకు 49-00
- విజ్ఞాన వీచికలు 99-00

## 5. BOOKS ON MEDITATION

*ధ్యాన సంబంధమైన గ్రంథములు*

- ధ్యానయోగ సర్వస్వము 75-00
- బుద్ధ ధ్యాన హృదయము 49-00

## 6. BOOKS ON SPIRITUALITY & TATVA CHINTANA

*ఆధ్యాత్మికత తత్వచింతన పూర్వ గ్రంథములు*

- సాయి మాస్టర్ ప్రవచనములు 199-00
- ఆధ్యాత్మిక జాగృతి 199-00

## 7. BOOKS ON PUJYA ACHARYA E.BHARADWAJA

*పూజ్య భరద్వాజ గురుదేవుల పై విరచితమైన గ్రంథములు*

- మహాత్ముల ముద్దుబిడ్డడు 149-00
- భగవాన్ శ్రీ భరద్వాజ 299-00
- మహా పురుషుడు 60-00
- సాయి మాస్టర్ స్మృతులు -1 199-00
- సాయి మాస్టర్ స్మృతులు -2 199-00
- ఆచార్య అమృత లేఖావళి 199-00
- మరో నంద దీపం 120-00
- మాస్టారు అమృత వాక్కులు 99-00

## 8. BOOKS FOR CHILDREN

*బాలల కొరకు విరచితమైన గ్రంథములు*

- బాలల సాయి లీలామృతము 49-00
- బాలల సాయిసన్నిధి 75-00
- బాలల శ్రీ గురు చరిత్ర 75-00

## 9. BOOKS IN ENGLISH

*ఆంగ్లంలో విరచితమైన గ్రంథములు*

- SAI BABA THE MASTER 249-00
- SHRI GURU CHARITRA 149-00
- SUPREME MASTER 149-00
- TAJUDDIN BABA 149-00
- SAI BABA AND HIS TEACHINGS 149-00
- CHILDREN'S SAI BABA THE MASTER 80-00

## 10. BOOKS IN OTHER LANGUAGES

*ఇతర భాషలో విరచితమైన గ్రంథములు*

- सद्गुरु श्री साई बाबा श्रीगुरुच 249-00
- కన్నడ సాయి లీలామృతం 249-00
- కన్నడ ప్రబోధామృతము 149-00
- కన్నడ గురు చరిత్ర 199-00
- కన్నడ సాయి సన్నిధి 249-00
- ఒరియా సాయి సన్నిధి 249-00
- కన్నడ మిలారెపా చరిత్ర 119-00
- కన్నడ స్వామి సమర్థ 119-00
- తమిళ్ సాయి లీలామృతము 249-00
- తమిళ్ షిరిడి హారతులు 29-00
- తమిళ్ స్తవన మంజరి 20-00
- తమిళ్ శ్రీ గురుచరిత్ర 299-00
- మలయాళ సాయి లీలామృతం 299-00
- మలయాళం గురు చరిత్ర 299-00


## 11. OTHER BOOKS

*ఇతర గ్రంథములు*

- సత్సంగము భజన 10-00
- పురుష సూక్త రహస్యము 49-00
- మనము మన సంస్కృతి 75-00

# 'శ్రీ గురు చరిత్ర' కృతజ్ఞతార్చన

సెప్టెంబరు 03, 2023




మానవ జీవిత లక్ష్యమైన ఆధ్యాత్మిక పరిపూర్ణతనొందడానికి పూర్ణుడైన సద్గురువును తెలుసుకొని, ఆశ్రయించి తగు రీతిన సేవించడానికి నిర్దుష్ట మార్గమైన 'శ్రీ గురు చరిత్ర'కు శతకోటివందనములతో కృతజ్ఞతార్చన

**Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.**
**Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,**
**Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.**



**గజానన్ మహరాజ్**

ఆగస్ట్ - సెప్టెంబరు 20, 2023

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.